వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

● ప్రతి గ్రామంలో రేపటి నుంచి రైతు సదస్సులు : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు జిల్లాలోని ప్రతి గ్రామంలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సుల్లో భవిష్యత్తులో భూసమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో రెవెన్యూ సదస్సులు, పల్లె పండుగ పనులు, నీటి పన్ను తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఒక రెవెన్యూ గ్రామంలో రెండు గ్రామ పంచాయతీలు ఉంటే రెండు సభలను నిర్వహించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించామని, ఈ నోడల్ అధికారులు తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమాలపై సమీక్షిస్తూ కొన్ని మండలా ల్లో పూర్తికాని పనులను ఎంపీడీవోలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై ఆయన అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని విద్యార్థులకు ఈనెల 6వ తేది ఉదయం 10గంటలకు రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఈ పోటీలకు కేంద్ర, రాష్ట్ర బోర్డులకు అనుబంధంగా ఉన్న పాఠశాల విద్యార్థులు మాత్రమే అర్హులని, గతేడాది కళాఉత్సవ్ విజేతలు ఈ పోటీల్లో పాల్గొనడానికి అవకాశం లేదని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు గానకళ, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, సంప్రదాయ కథావిన్యాసం తదితర పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారని తెలిపారు. వివరాలకు ప్రోగ్రాం కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్న డైట్ అధ్యాపకులు శ్రీదేవి (9441228359), అసదుల్లా (9440084715) నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

స్కూల్లో టీచర్ అనుమానాస్పద మృతి

● విద్యార్థులు కొట్టి చంపారని భార్య ఆరోపణ



మృతిచెందిన ఉపాధ్యాయుడు ఎజాజ్ (ఫైల్‌ఫొటో)

రాయచోటిటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. గొడవ పడుతున్న విద్యార్థులను మందలించినందుకు ఆయన్ను విద్యార్థులే కొట్టి చంపారని భార్య చెబుతుండగా, అలాంటిదేమీ లేదని ఒక్కసారిగా కుప్పకూలిపోయారని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలోని కొత్తపల్లె జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈ సంఘటన జరిగింది. పోలీసులు, మృతుడి భార్య కథనం మేరకు..

రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఎజాజ్(42) ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. బుధవారం సుమారు 3 గంటల ప్రాంతంలో ఆయన ఒక్కసారిగా పాఠశాలలోనే కుప్పకూలిపోయారు. వెంటనే పాఠశాల సిబ్బంది ఎజాజ్ భార్యకు సమాచారం ఇచ్చి, ఆయనను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు ఎజాజ్ అప్పటికే చనిపోయారని చెప్పారు. ఎజాజ్ భార్య రహిమూన్ మీడియాతో మాట్లాడుతూ.. తన భర్తకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని, ఐదు పూటలా నమాజు చేస్తాడని, ప్రతిరోజు వాకింగ్‌కు వెళ్తాడని చెప్పారు. తన భర్త ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్తాడని, అది భరించలేని కొంతమంది ఉపాధ్యాయులు బయట వాళ్లతో కలిసి తన భర్తను విద్యార్థుల చేత కొట్టించి చంపించారని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థులు కొట్టిన విషయాన్ని ఉపాధ్యాయులంతా కలిసి బయటికి రానివ్వకుండా తన భర్త గుండెపోటుతో చనిపోయాడని చెబుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు విచారించి తన భర్తను కొట్టి చంపిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన వారిని, సహకరించిన ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఎజాజ్ పాఠశాలలో కుప్పకూలిపోయారని, ఆయనపై విద్యార్థులు దాడి చేయలేదని హెచ్‌ఎం చెప్పారని అన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టుగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

నాలుగు గంటలు ఆలస్యంగా సెవెన్‌హిల్స్ రైలు

ములకలచెరువు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి బుధవారం నడిచే సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. సాంకేతిక కారణాలతో నాలుగు గంటలకు పైగా ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారు జామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 7.15 గంటలకు వచ్చింది. మదనపల్లె రోడ్‌కు ఉదయం 7.45కు, కలికిరికి ఉదయం 8.10కు, పీలేరుకు ఉదయం 8.24 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు చేరాల్సిన రైలు ఉదయం 9.54 గంటలకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా...?

● ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

● అసెంబ్లీలో నల్లారి ప్రస్తావనతో చిగురించిన ఆశలు ● ఎదురుచూస్తున్న పీలేరు ప్రజలు

పీలేరు నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా అని ఇక్కడి ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లూ ఇక్కడి ప్రాజెక్టులను పూర్తిగా గాలికి వదిలేసింది. ప్రాజెక్టుల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఆయన అభ్యర్థన మేరకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేసి తమకు కాసిన్ని నీళ్లు అందుబాటులోకి తెస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు.



అసంపూర్తిగా మిగిలి ఉన్న అడవిపల్లె ఔట్‌ఫ్లో కాలువ (ఫైల్ ఫొటో)

నిధులు వచ్చే వరకు విశ్రమించేది లేదు..

ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలోని రైతులు, సామాన్యులకు నీటి సమస్య ఉండదు. గత హయాంలో ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేసిన వారు పీలేరు గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. అందుకే ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అసెంబ్లీ సమావేశాల కంటే ముందు అధికారులు, సంబంధిత మంత్రితో మాట్లాడి ఝరికోన ప్రాజెక్టు కోసం రూ.60 లక్షలు మంజూరు చేయించుకోగలిగాను. ఆ పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులన్నీ పూర్తయ్యే వరకు విశ్రమించేది లేదు.

- నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు

వారం రోజుల్లో ఝరికోన టెండర్లు

ఝరికోన ప్రాజెక్టు మోటార్ల రిపేర్ల కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. రూ.20 లక్షల కంటే ఎక్కువగా ఉండే పనులను టెండర్ల ద్వారా చేపట్టాలి. అందుకని అనుమతుల కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లో టెండర్లను ఆహ్వానిస్తారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే మరమ్మతులు చేపడతాం.

- రషీద్‌ఖాన్, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మదనపల్లె

వాల్మీకిపురం సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ (ఫైల్‌ఫొటో)



పీలేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పీలేరు, కేవీపల్లె, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలు ఉన్నాయి. వాటిలో పీలేరు పట్టణ తాగునీటి అవసరాల కోసం కొత్తపల్లె వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, వాల్మీకిపురం అవసరాల కోసం భోగంపల్లె రిజర్వాయర్, కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల ప్రజలకు సురక్షిత తాగునీటి కోసం కేవీపల్లె మండలంలో ఝరికోన ప్రాజెక్టు, కలికిరి మండలంలోని సాగునీటి అవసరాల కోసం మేడికుర్తి వద్ద బాహుదా నదిపై ప్రాజెక్టు నిర్మించారు. ఇక మిగిలింది గుర్రంకొండ మండలం మాత్రమే. దానికి కూడా ఝరికోన ప్రాజెక్టు నుంచి తాగునీరు, హంద్రీ-నీవా పథకంలో సాగునీరు అందిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అని ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

అడవిపల్లె రిజర్వాయర్‌లో అంతులేని జాప్యం

హంద్రీ-నీవా పథకంలో కేవీపల్లె మండలం అడవిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కేవీపల్లె, పీలేరు, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పాకాల, ఐరాల, పూతలపట్టు, తవనంపల్లె, బంగారుపాళెం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు మండలాల్లోని 80 వేల ఎకరాలకు సాగునీరు, అనేక వందల గ్రామాలకు తాగునీరు అందించాలని ప్రణాళికలు రూపొందించారు. 2006లో రూ.55.59 కోట్లతో ప్రధాన ప్రాజెక్టుతో పాటు కాలువలు నిర్మించాలని మొదటి దశ పనులుగా విభజించి ప్రారంభించగా ఆ పనులు 2016లో పూర్తయ్యాయి. ఆ ప్రాజెక్టు పరిశీలనకు ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన చంద్రబాబు అడవిపల్లె రిజర్వాయర్ సామర్థ్యం గురించి తెలుసుకుని మరో టీఎంసీ పెంచి అక్కడి నుంచి చిత్తూరు పట్టణానికి తాగునీరు అందిస్తానని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి నిర్మాణం చేయడానికి 2016లో అధికారులు రూ.29.21 కోట్లతో పనులు ప్రారంభించారు.



కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ (ఫైల్)

టీడీపీ హయాంలో పరుగులు పెట్టిన రిజర్వాయర్ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధుల లేమితో మందగించాయి. హంద్రీ-నీవా పథకంలో గొలుసుకట్టు విధానంలో నిర్మితమైన ప్రాజెక్టులు కావడంతో ఎగువన రాయచోటి ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండితేగానీ అడవిపల్లె రిజర్వాయర్ నిండే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తెచ్చే కాలువలు కూడా అసంపూర్తిగా ఉండడంతో కేవలం వర్షాధారంగా ప్రాజెక్టు నిండుతోంది.

మేడికుర్తి ప్రాజెక్టు కింద 'మేడి' పట్టని రైతులు

కలికిరి మండలం మేడికుర్తి సమీపంలోని బాహుదా నదికి అడ్డంగా 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.6 కోట్లతో ప్రాజెక్టు నిర్మించింది. 4400 ఎకరాల ఆయకట్టుకు నీరందించడానికి 12 కి.మీ. పొడవు ఎడమ కాలువ, 16 కి.మీ. కుడి కాలువల నిర్మాణానికి విడిగా పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టు కోసం 2300 మీటర్ల మట్టి కట్ట, 420 మీటర్ల పొడవుతో సిమెంటు మొరవ, తూములు నిర్మించేందుకు రూ.5.57 కోట్లు ఖర్చు చేశారు. ఆ పనులు దక్కించుకుంది అప్పటి పీలేరు ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. అయితే రెండు కాలువలనూ నిర్మించకుండా పనులు అర్ధాంతరంగా ఆపేశారు. 2015లో వచ్చిన భారీ వర్షాలకు ఆ ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఆ వెంటనే ప్రభుత్వం తాత్కాలికంగా నీటిని నిలిపేందుకు రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గోనె సంచుల్లో ఇసుక నింపి అడ్డుకట్ట వేసినా అవి కూడా కొట్టుకుపోయాయి. ఇసుక బస్తాల వ్యవహారంలోనూ భారీగా అవినీతి జరిగినట్లు అప్పుడు విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ప్రాజెక్టు నిర్మాణం గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు దానిలోని సుమారు లక్ష టన్నుల ఇసుకను ఇష్టారాజ్యంగా అమ్ముకుని కోట్లు గడించారు. మేడికుర్తి ప్రాజెక్టును పునరుద్ధరించి తాత్కాలికంగానైనా నీళ్లు నిలపాలంటే రూ.5 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కనుమరుగు దశలో భోగంపల్లె రిజర్వాయర్

వాల్మీకిపురం పట్టణ తాగునీటి, మండలంలోని రైతుల సాగునీటి అవసరాల కోసం 2008లో అప్పటి చీఫ్ విప్ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో వాల్మీకిపురం శివార్లలో రూ.7 కోట్ల వ్యయంతో భోగంపల్లె రిజర్వాయర్ నిర్మాణానికి పునాది పడింది. తదనంతర కాలంలో ఆయన సీఎం కావడంతో 2014 వరకు రిజర్వాయర్ పనులు వేగంగా జరిగాయి. ఆ తరువాత పనులు మందగించాయి. 2019 తరువాత ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రిజర్వాయర్ ద్వారా 1400 ఎకరాలకు తాగునీటిని అందించే దిశగా నిర్మించిన కుడి, ఎడమ కాలువలు నేడు కనుమరుగయ్యాయి. కొద్ది నెలలుగా జరుగుతున్న ఎన్‌హెచ్ రహదారి పనులతో రిజర్వాయర్ ప్రాంతం కనుమరుగవుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణకు నోచుకోని ఝరికోన ప్రాజెక్టు

కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉండగా కేవీపల్లె మండలం గువ్వలగుడ్డం వద్ద ఝరికోన ప్రాజెక్టును రూ.100 కోట్లతో నిర్మించారు. కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాల పరిధిలోని 650 గ్రామాల్లోని 1.42 లక్షల మందికి తాగునీరు అందించే ఆ ప్రాజెక్టు పట్ల వైసీపీ ప్రభుత్వం కనీసం కన్నెత్తి చూడలేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లూ ఆ ప్రాజెక్టు నిర్వహణకు కనీసం రూపాయి కూడా ఇవ్వలేదు. ఇటీవల ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో ఝరికోన ప్రాజెక్టు మోటార్ల రిపేర్ల కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది.

కడప, రాయచోటిలో డ్రగ్స్ నియంత్రణ విభాగాలు

● ఒక్కో జిల్లా కార్యాలయంలో ఎస్‌ఐ సహా సిబ్బంది
● రీజినల్ స్థాయిలో సీఐ అధికారి పర్యవేక్షణ
● తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు

6

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

వివరాలు... 7లో



నకిలీ ధ్రువపత్రాల కలకలం!

● పోలీసులకు ఫిర్యాదు చేసిన పీలేరు తహసీల్దారు



పీలేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంతకాలం కుప్పలు తెప్పలుగా బయట పడిన నకిలీ ఇంటి పట్టాలతో తలలు పట్టుకుంటున్న పీలేరు రెవెన్యూ అధికారులకు మరో కొత్త సమస్య వచ్చి పడింది. నకిలీ పట్టాల తరహాలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు కూడా చెలామణి అవుతున్నాయని బుధవారం అధికారులకు తెలిసింది. దీంతో అప్రమత్తమైన పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు ఆ వ్యవహారాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే ఒక ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్, తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉండే ఒక స్టాంపురైటర్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సాధారణంగా నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే దరఖాస్తుదారులు తమ ప్రాంత సచివాలయాల్లో గానీ, మీ-సేవ కేంద్రాల్లో గానీ దరఖాస్తు చేసుకోవాలి. అలా వచ్చిన దరఖాస్తులను వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ స్థాయిలో నిర్ధారణ చేసిన తరువాత తహసీల్దారు మంజూరు చేస్తుంటారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఆయా ధ్రువపత్రాలను తహసీల్దారు ఆమోదించిన తరువాత సెల్ ఫోన్‌కు వచ్చే సందేశం ద్వారా తెలుసుకుని దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేసుకున్న సచివాలయంలో, మీ-సేవ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. అయితే రెండు రోజుల కిందట తమ వద్దకు వచ్చిన ఓ నివాస ధ్రువీకరణ పత్రం నిజమైనదో కాదో నిర్ధారించమని స్థానిక సబ్-రిజిస్ట్రారు కార్యాలయ సిబ్బంది తహసీల్దారు కార్యాలయానికి పంపారు. దాన్ని చూసిన తహసీల్దారు అది నకిలీదని నిర్ధారించి ఆ ధ్రువీకరణ పత్రం సమర్పించిన వ్యక్తిని విచారించారు. ఆ ధ్రువీకరణ పత్రాన్ని తనకు ఓ స్టాంపు రైటర్ అందించాడని తెలపగా అతన్ని విచారించారు. తహసీల్దారు కార్యాలయంలో పనిచేసే ఓ కంప్యూటర్ ఆపరేటర్ తనకు ఇచ్చాడని స్టాంపు రైటర్ తెలపడంతో తహసీల్దారు ఈ వ్యవహారంపై బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సబ్-రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లిన నివాస ధ్రువీకరణ పత్రంలో తన సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాకుండా కార్యాలయ సీళ్లను కూడా వేశారని, అవి కూడా నకిలీ అయి ఉంటాయని ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ హుటాహుటిన స్టాంపు రైటర్, కంప్యూటర్ ఆపరేటర్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ విషయం రాయచోటి డీఎస్పీ దృష్టికి వెళ్లడంతో విచారణలో ఆయన కూడా భాగస్వామి అయ్యే అవకాశం ఉందని పీలేరు పోలీసులు తెలిపారు.

ఈ విషయమై తహసీల్దారు మాట్లాడుతూ నకిలీ నివాస ధ్రువీకరణ పత్రం బయటపడిన విషయం వాస్తవమేనని, తానే పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారి విచారణలో వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాల తయారీలో ఎవరున్నా ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే నకిలీ ఇళ్ల పట్టాలతో అటు అధికారులు, ఇటు లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నకిలీ ధ్రువీకరణ పత్రాల వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది. కేటుగాళ్లు కేవలం ధ్రువీకరణ పత్రాల వరకే పరిమితమయ్యారో లేక భూవ్యవహారాల్లో కూడా తమ ప్రతాపం చూపించారేమోనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

బతుకు దెరువు కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు

- కువైత్‌లో చౌడసముద్రం వాసి మృతి..
- శోకసంద్రంలో కుటుంబీకులు


మృతి చెందిన ఆజాద్‌బేగ్

ములకలచెరువు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైత్‌కు వెళ్లిన చౌడ సముద్రం వాసి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్థుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం చౌడ సముద్రం వాసి ఆజాద్‌బేగ్(45) బతుకుదెరువు కోసం రెండేళ్ల కిందట కువైత్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య మక్బూల్, కుమార్తె నగీనా, కొడుకు నాసీర్‌బాషా ఉన్నారు. ఈ క్రమంలో కువైత్‌లో పనిచేస్తూ అజాద్‌బేగ్ ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. సహచరులు గమనించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం కుటుంబీకులకు సమాచారం అందడంతో వారు విషాదంలో మునిగిపోయారు. కాగా ఆజాద్‌బేగ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య


మృతిచెందిన రామాంజులు

సంబేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తండ్రి, భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాలవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామాంజులు (21) రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో భార్య, అతని తండ్రి మందలించినందుకు మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. కాగా బుధవారం తెల్లవారే సరికి వారి మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు.

వైరల్ ఫీవర్‌తో చిన్నారి మృతి


దేవాన్షి (ఫైల్ ఫొటో)

పుల్లంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్వరం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సుమారు 15 నెలల చిన్నారి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూసింది. పుల్లంపేట మండలం చెర్లోపల్లె అరుంధతివాడకు చెందిన వెంకటేశ్, సాయితేజశ్రీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె దేవాన్షి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో కడపలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చి రాజంపేటలోని ప్రైవేటు డాక్టర్ వద్ద చూపించారు. ఎంతకీ తగ్గకపోవడంతో కడప రిమ్స్‌కు తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చిన్నారి మృతిచెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

రేపటి నుంచి కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7 తేదీల్లో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా యువకుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సాంకేతిక విద్యాశాఖ ఈ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప రీజియన్ పరిధిలోని 32 ప్రభుత్వ, ప్రైవేటు, ఫార్మసీ కళాశాలల నుంచి 140 ఆవిష్కరణలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 6వ తేది ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సుబ్రమణ్యం హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమంగా నిలచిన 20 ఆవిష్కరణలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతికి రూ.10 వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 550 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదర్శం.. ఆ క్యాంటీన్

- జిల్లా ఆసుపత్రిలో మెప్మా ఆసరాతో క్యాంటీన్
- స్వయం కృషితో అభివృద్ధి చేసిన లక్ష్మీదేవి
- ఇంటి భోజనం మరిపించేలా వంటలు
- పలువురు మహిళలకు ఉపాధి కల్పన


సమత క్యాంటీన్ బృందంతో బండి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న క్యాంటీన్ మహిళలకు ఉపాధినిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్యాంటీన్‌ను 10 సంవత్సరాలుగా మహిళలే నిర్వహిస్తుండటం విశేషం. గతంలో జిల్లా ఆసుపత్రి వద్ద క్యాంటీన్‌లేక రోగులు, వారి బంధువులు బయట అధిక ధరలకు భోజనాలు కొనలేక ఇబ్బందులు పడేవారు. దీనిని గమనించిన అప్పటి కలెక్టర్ కోన శశిధర్ హయాంలో 'సమత పట్టణ మహిళా సమాఖ్య' ఆధ్వర్యంలో 2014లో జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) అధ్యక్షురాలు బండి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో క్యాంటీన్‌ను నిర్వహించే వారు. ఆమె మెప్మాలోని మహిళలను క్యాంటీన్‌లో పనికి పెట్టుకుని పేదప్రజలను, రోగులను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకే రుచికరమైన భోజనం అందించాలని సంకల్పం పెట్టుకున్నారు. క్యాంటీన్ ప్రారంభంలో రోజుకు రూ.200 నుంచి రూ.300 వ్యాపారం మాత్రమే జరిగేది. అయినా ఆమె నిరుత్సాహ పడకుండా కష్టాన్ని నమ్ముకుని రోగుల కడుపు నింపాలని దృఢ నిశ్చయంతో ఇంటిని మరిపించే విధంగా భోజనాలను తయారు చేస్తూ రోగులు, రోగుల బంధువులతో మన్ననలు పొందుతూ వచ్చారు. కరోనా సమయంలో కూడా రోగులకు భోజన సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. నైట్ షెల్టర్‌లో ఉండేవారికి రోజుకు ఒక్కో భోజనం రూ.25కే వారు చెప్పిన మెనూతోనే భోజనం ఇచ్చేవారు. ఇలా ఒక సంవత్సరం పాటు నైట్‌షెల్టర్ వారికి భోజనాలు పంపించారు.

మెప్మాలో సభ్యురాలిగా మొదలై..

లక్ష్మీదేవి 2007 నుంచి మెప్మాలో సభ్యురాలుగా ఉంటూ వారి గ్రూపునకు లీడర్‌గా కొనసాగారు. 2011వ సంవత్సరంలో ఆమె లీడర్‌గా నిర్వహిస్తున్న పనితీరును చూసి అధికారులు టీఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా నియమించారు. అప్పటి నుంచి ఆమె మహిళల అభివృద్ధికి కావాల్సిన ఎన్నో సూచనలు, సలహాలు అందించారు. అనేక సంవత్సరాలుగా ఆమె మహిళల అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు. ఆమె సేవా దృక్పథానికి మెచ్చి అధికారులు కరోనా అనంతరం క్యాంటీన్ బాధ్యతలు పూర్తిగా ఆమెకే అప్పగించారు. దీంతో లక్ష్మీదేవి మెప్మాలో రూ.2 లక్షలు లోను తీసుకుని క్యాంటీన్‌ను మరింత అభివృద్ధి చేశారు. క్యాంటీన్ ప్రారంభం నుంచి నేటి వరకు ఆరుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహించాలనుకుంటే వీరి క్యాంటీన్‌లోనే వంటకాలు తయారు చేయిస్తారు.

ఇంటిని మరిపించే భోజనమే లక్ష్యం - బండి లక్ష్మీదేవి, యజమానురాలు



మా క్యాంటీన్‌కు వచ్చే రోగులు, వారి బంధువులకు ఇంటిని మరిపించే విధంగా భోజనాలు ఇవ్వడమే మా లక్ష్యం. నాతోపాటు పనిచేసే మహిళల సహ కారంతోనే క్యాంటీన్‌లో ఇంటిని మరిపించే భోజనాలను వండుతున్నాం. క్యాంటీన్‌లో ఆరుగురు మహిళలు పనిచేస్తున్నారు. మా స్టాఫ్‌కు మహిళా దినోత్సవం రోజున చిరుసన్మానం చేసి బట్టలు అందిస్తాను. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా బోనస్ ఇచ్చి వారిని గౌరవిస్తాను. మెప్మావారు అందించే ఆర్థిక ఆసరాతో మహిళలు అభివృద్ధి చెంది స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలన్నదే నా ఆశయం.

రాగి సంగటి బాగుంది

- మునెమ్మ, పేషంట్ బంధువు



ఈ క్యాంటీన్‌లో రాగిసంగటి, అందులోకి ఇచ్చే కూరలు చాలా బాగున్నాయి. ఇక్కడ పనిచేసే స్టాఫ్ కూడా వచ్చిన వారితో చాలా మంచిగా మాట్లాడుతూ వారికి ఏమికావాలో అడిగి మరీ వడ్డిస్తుంటారు. తక్కువ ధరలోనే మంచి రుచికరమైన సంగటి తినడం సంతోషం కలిగించింది.

కలిసికట్టుగా పనిచేస్తాం

- లక్ష్మి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్ ప్రారంభం నుంచి పనిచేస్తున్నాను. ఇందులో వచ్చే జీతంతోనే మెప్మాలో తీసుకున్న రుణం నెల నెలా కంతులు కడుతున్నాను. ఇక్కడ మేమంతా కలిసికట్టుగా పనిచేస్తూ క్యాంటీన్‌కు వచ్చేవారికి మంచి భోజనం అందిస్తున్నాం.

మాలో ఒకరిగా

- జయమణి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్‌లో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. మా యజమానురాలు మాలో ఒకరిగా కలిసిపోయి పనిచేస్తున్నారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి మంచి రుచికరమైన భోజనం అందించాలని కోరుకుంటారు.

కడప, రాయచోటిలో...

డ్రగ్స్ నియంత్రణ విభాగాలు

- ఒక్కో జిల్లా కార్యాలయంలో ఎస్‌ఐ సహా సిబ్బంది
- రీజనల్ స్థాయిలో సీఐ అధికారి పర్యవేక్షణ
- తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు
- ఫిర్యాదులు చేయడానికి 1972 టోల్ ఫ్రీ నంబరు
- నేరుగా అమరావతిలోని 'ఈగల్' స్టేషన్‌తో అనుసంధానం

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న డ్రగ్స్ చలామణిని నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సమాయత్తమవుతోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న దశలో దీన్ని తుద ముట్టించేందుకు రాష్ట్ర స్థాయిలో 'ఈగల్' (ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించడానికి ఈగల్ చీఫ్‌గా (నార్కోటిక్) ఐజీ స్థాయి అధికారి ఆకే రవికృష్ణను నియమించారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడంపై ఈగల్ దృష్టి సారించనుంది. ప్రధానంగా విద్యార్థులు, యువత ఈ మహమ్మారి బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు వివిధ రకాల వ్యూహాలను ఈగల్ అమలు చేయనుంది. ఇప్పటి వరకూ మాదక ద్రవ్యాలను నియంత్రించడానికి స్థానిక పోలీసులు మాత్రమే చొరవ చూపాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ బాధ్యతలను ఈగల్ తీసుకోనుంది. ఎన్టీడీడీ (ట్రాన్స్‌పోర్ట్, డెస్టినేషన్, డిమాండ్) పై ఈగల్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది.

రెండు జిల్లాల్లో.. ఈగల్ సెల్‌లు

రాష్ట్ర స్థాయిలో ఈగల్ సమర్థవంతంగా పనిచేయడంతో క్షేత్ర స్థాయిలో జిల్లాల్లో ఈగల్ సెల్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈ విభాగం నేరుగా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే ఎస్పీఎఫ్ (ప్రత్యేక రాష్ట్ర స్థాయి పోలీసు స్టేషన్) సెల్‌కు మాత్రమే బాధ్యత వహించనుంది. కడప, రాయచోటిలో ఈగల్ సెల్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ విభాగాల నిర్వహణను ఎస్‌ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. తగినంత మంది ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌ను నియమించనున్నారు. ప్రాథమికంగా మత్తు పదార్థాల ఉనికి సంబంధిత సమాచారాన్ని రహస్య సేకరణ ద్వారా సమీకరించనున్నారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. అనంతరం పట్టుబడిన వారిని స్థానిక పోలీసు స్టేషన్లకు అప్పగించి విచారణ చేయించనున్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈగల్ విభాగాలను రీజినల్ స్థాయిలో ఒక సీఐ పర్యవేక్షించనున్నారు. వీటన్నిటినీ నేరుగా అమరావతి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రధాన కేంద్రంతో అనుసంధానం చేస్తున్నారు. ఈగల్ నమోదు చేసే కేసులను విచారించి తొందరగా పరిష్కరించడానికి రాయలసీమకు సంబంధించి తిరుపతిలో ఒక ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారమేదైనా వుంటే 1972 టోల్ ఫ్రీ నంబరుకు చేరవేయవచ్చు. సమాచారం తెలిపే వ్యక్తులకు సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా వుంచుతారు.

సంచలనం కలిగించిన పీలేరు సంఘటన

ఇటీవల మత్తు పదార్థాల వ్యసనపరులైన ఇద్దరు యువకులు పీలేరు సమీపంలో రైలు ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన సంఘటన సంచలనం కలిగించింది. గంజాయి మత్తుకు బానిసలైన యాసిన్‌అలీ(17), కిరణ్‌కుమార్(20) ఇంటర్మీడియట్ విద్యార్థులు 2024 అక్టోబరు 23న రాత్రి రైలు పట్టాలపై కూర్చుని మత్తు పదార్థాలు సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఈ సంఘటనతో మాదక ద్రవ్యాల ఉనికిని ఈ ప్రాంతంలో మొదటిసారిగా తేటతెల్లం చేసింది. ఆ వెంటనే గంజాయి లేదా మాదక ద్రవ్యాల ఆనవాళ్ల కోసం కలికిరి, పీలేరు పట్టణాల్లో విస్తృతంగా గాలించినా లభ్యం కాలేదు. ఇలాంటి సందర్భాల్లో రహస్య విచారణ ద్వారా సమాచారం సేకరించడానికి ఈగల్ విభాగాలు కృషి చేయనున్నాయి. అంతేగాకుండా తల్లిదండ్రులకు, బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మొత్తం మీద మత్తు పదార్థాల నిర్మూలన కోసమే జిల్లా స్థాయిలోని విభాగాలు క్షేత్ర స్థాయిలో పనిచేయనున్నాయి.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

పెద్దమండ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) 'అక్కడ ఇళ్ల నిర్మాణా లెలా....?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి మదనపల్లి డివిజన్ హౌసింగ్ యంత్రాంగం స్పందించింది. పెద్దమండ్యం మండలంలో బుధవారం హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి పర్యటించారు. జగనన్న లే ఆవుట్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వెలిగల్లు, పెద్దమండ్యం, పి.తురకపల్లి జగనన్న లే ఆవుట్‌ల్లో ఇళ్ల దశల వారీ నిర్మాణాలను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ, సౌకర్యాలపై గ్రామస్తులతో ఆరా తీశారు. అనంతరం కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఇంజనీరు అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి సిబ్బందితో వారు మాట్లాడుతూ మండలంలోని లే ఆవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి సూచనలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలకు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణ సహాయం అందించాలన్నారు. పెద్దమండ్యం జగనన్న కాలనీల్లో వీధుల్లో వర్షపు నీళ్లు ఇంకిపోడానికి ఉపాధి నిధులతో మట్టి తరలించాలని, లేఅవుట్ ముందుభాగంలో చిన్న కాల్వ తీయాలన్నారు. ఇంజనీరు అసిస్టెంట్లకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అన్ని కాలనీల్లో రోడ్లు, విద్యుత్తు, నీటిసౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అర్హులైన నిరుపేదలు పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంపీడీఓ, సర్పంచ్ బాష, హౌసింగ్ ఏఈ అక్రం, ఇంజనీరు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, బస్సు, (ఇన్‌సెట్లో) మృతిచెందిన లారీ డ్రైవర్ పరమానంద్

రాజంపేటటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన రాజంపేట పట్టణ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సును రాజంపేట భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో కడప నుంచి చెన్నైకు వెళుతున్న ఐషర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న నీరగుండి పరమానంద్(42) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్ లోకేశ్‌రెడ్డికి కుడికాలు, క్లీనర్ కె.నరసింహారెడ్డి చేతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు తనూజ, ప్రవీణ్, సునీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ యల్లమ రాజు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఖాసింపీరా, సిబ్బంది క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతిచెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని దేవర హిప్పిగిరికి చెందినవాడిగా గుర్తించారు.

కారు ఢీకొని మరొకరు...


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సదాశివరెడ్డి

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సదాశివరెడ్డి(53) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కూరపర్తి గ్రామానికి చెందిన సదాశివ రెడ్డి జీవనం నిమిత్తం మదనపల్లెలో నివాసముంటున్నాడు. సొంతపనుల నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణ సమీపంలోని సబ్‌జైలు నిర్మాణ ప్రాంతంలో మదనపల్లె వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబాంబులు పేలి పాడిఆవులకు తీవ్రగాయాలు

- సంఘటనపై విచారించిన పోలీసులు

బి.కొత్తకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అడవిపందుల కోసం అమర్చిన నాటుబాంబులు కొరికి రెండు పాడిఆవులు తీవ్రంగా గాయపడిన సంఘటనపై బుధవారం సీఐ రాజారెడ్డి విచారణ చేపట్టారు. మండలంలోని వేమిలేటి కోట పంచాయతీ కొత్తపల్లె శివారులో గుమ్మసముద్రం చెరువు మొరవ వద్ద కొత్తపల్లెకు చెందిన రైతు శివన్న మొక్కజొన్న పంట సాగుచేశాడు. తన పంటను అడవిపందులు ధ్వంసం చేస్తుండడంతో, బి.కొత్తకోట పట్టణం ఆలేటి పల్లె క్రాస్‌లో గుడిసెలు వేసుకుని నివాసం వుంటున్న వెంకటస్వామి చేత నల్లమందు, బెల్లంతో కూడిన నాటుబాంబులను తయారు చేయించి పొలం చుట్టూ అమర్చాడు. అది ఎవరికీ తెలియకుండా రహస్యంగా వుంచారు. అది తెలియక అదే కొత్తపల్లికి చెందిన మరోరైతు కె.సురేంద్ర పాడిఆవులు రెండు అటుగా వెళుతూ ఆ నాటుబాంబులను బెల్లం వుండలుగా భావించి కొరికాయి. ఒక్కసారిగా అవి పేలడంతో రెండు పాడిఆవుల ముఖాలు ఛిద్రమయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటనపై వీఆర్‌ఓ కోటిరెడ్డి, సీఐ రాజారెడ్డి విచారణ చేశారు. బాధితరైతు సురేంద్ర వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పశుసంవర్థకశాఖ అధికారులు ఈ ఆవులను పరిశీలించి అవి బతకడం సాధ్యం కాదని ధ్రువీకరించారు. సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నారు.


నాటుబాంబు పేలి గాయపడిన పాడిఆవు, సంఘటనా స్థలంలో విచారిస్తున్న సీఐ రాజారెడ్డి

అశ్వ-2కే24కు దరఖాస్తు చేసుకోండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

కురబలకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు అశ్వ-2కె24కు దరఖాస్తు చేసుకోవాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 21, 22 తేదీల్లో అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె24ను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏటా నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, WWW.mits.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ద్వారకనాథ్, కమాల్‌బాషా, ప్రదీప్‌కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షిత పాల్గొన్నారు.

పేద రైతులకు 'ఉపాధి' అండగా...

- ఉద్యాన పంటలకు ఆర్థిక భరోసా ఇస్తున్న ఉపాధి పథకం
- బంజరు భూమిలో పండ్లతోటల సాగు
- సిరుల పంట పండిస్తున్న మహిళా రైతు గ్రేసమ్మ

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంటలు కలిసి రాక కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న పేద రైతులకు ఉపాధి పథకం ద్వారా చేపట్టిన ఉద్యాన పంటల సాగు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. పంటల సాగుకు అంతగా అనుకూలంగా లేని బంజరు భూమి కలిగిన రైతులు ఈ పథకం ద్వారా తక్కువ ఖర్చు తో అధిక లాభాలు పొందుతున్నారు. ఇదే కోవలో గ్రేసమ్మ అనే పేద మహిళా రైతు చీనీ సాగు చేపట్టి మంచి ఫలసాయం తీస్తూ.. స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలువురు రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యానపంటలు సాగుకు మక్కువ చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 2019- 20 ఆర్థిక సంవత్సరంలో 1866 మంది రైతులు 2420 ఎకరాల్లో చీనీ తోటలను సాగులోకి తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా ఉద్యాన రెతులకు అందిస్తున్న రాయితీలు మరింత చేయూ త నిస్తున్నాయి. గ్రామీణ రైతులు, రైతు కూలీలను ఈ పథకంలో అనుసంధానం చేయడంతో చీనీ సాగు వైపు మొగ్గు చూపుతూ.. చక్కటి ఉపాధి పొందుతున్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఈపథకం కింద 703 మంది రైతులు 1857 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేపట్టారు. ఇందులో 246 మంది రైతులు 781 ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేశారు.


దౌలతాపురంలో సాగులో ఉన్న చీనీ తోట

పేద రైతులకు ఆదర్శంగా... గ్రేసమ్మ



మండలంలోని దౌలతాపురం గ్రామానికి చెందిన నల్లబల్లె గ్రేసమ్మ సాధారణ మహిళ రైతు. ఆమె భర్త రూబిన్ పేరుతో ఎకరా బంజరు భూమి ఉంది. ఆ భూమిలో చీనీ పంటను సాగు చేసి బంగారు పంట పండిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని అతి తక్కువ పెట్టుబడితో చీనీ చెట్ల సాగు చేపట్టి మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. 2019 జూలై చివరిన గ్రేసమ్మకు చెందిన ఎకరా పొలంలో చీనీ పంట సాగు కోసం రూ.64,337ల ఖర్చును సాంకేతిక సహాయకులతో అంచనా వేశారు. వంద చీనీ మొక్కలకు గాను వేతనాల ఖర్చు 88,612, మెటీరియల్‌కు 41454గా అంచనా వేశారు. అలాగే ఆమె జాబ్‌కార్డు హోల్డరు కాబట్టి 380 పనిదినాలకు 2019 సెప్టెంబరు 11న ఆ పని ఆమోదం పొంది.. అదే రోజు నుంచి దౌలతాపురంలోని శ్రమశక్తి సంఘాల ద్వారా పనులు ప్రారంభించారు. బంజరు భూమిని సాగులోకి తెచ్చి సాగుబడి నిర్వహణ, సంరక్షణకు మూడేళ్లపాటు 225 పనిదినాలతో రూ.50,161, వేతనాలకు యాజమాన్య వ్యయఖర్చులతో 14226 మొత్తం కలిపి 64331లను ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేశారు. ఈ చీనీ మొక్కలకు 5ఏళ్ల రాగానే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటిసారి చీనీపంట దిగుబడి అందింది. మొదటి కాపులో దిగుబడి 1500 కేజీలు రాగా క్వింటా ధర 2300లతో 15 క్వింటాళ్లకు 34500 మేర రాబడి వచ్చింది. కాయల కోత, మార్కెట్ రవాణా ఖర్చులు పోను 30వేలు ఆమెకు లాభంగా చేతికి అందింది. భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో కుటుంబ భారం మోస్తున్న గ్రేసమ్మకు ఉపాధి ద్వారా అందిన చేయూత బలాన్నిచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీపథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రకారం పని కోరిన వారికి పని కల్పించడం జరుగుతుంది. జిల్లాలో ఈ పథకం ద్వారా ఎకరా బంజరు భూమి ద్వారా చీనీ పంటల పెంపకం సాగులోకి తీసుకువచ్చాం. చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామానికి చెందిన మహిళారైతు గ్రేసమ్మ (జాబ్‌కార్డు హోల్డర్) ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆమె చేసిన పనులకు సంబంధించి 50161 రూపాయలు వేతనాలు చెల్లించడం జరిగింది.

- వి.ఆదిశేషారెడ్డి, ఉపాధి పథక సంచాలకులు

పోలీసుల అదుపులో రౌడీషీటర్ హత్య కేసు నిందితులు?

ప్రొద్దుటూరు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రౌడీషీటర్ పప్పీ గ్యాంగ్‌కు చెందిన లీడర్ పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్ర హత్య కేసులో ప్రధాన నిందితులైన యనమల లోకేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని విచారణ నిమిత్తం కడపకు తరలించినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం హత్య సంఘటన వెలు గులోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు రెండు బృందాలుగా పలు చోట్ల గాలింపు చర్యలు చేపట్టారు. హత్య కేసులో నిందితులుగా వున్న లోకేష్‌రెడ్డి, సునీల్ రెడ్డిలకు చెందిన బంధువులు, స్నేహితులతో పాటు సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డ్స్ ఆధారంగా కూడా పలువురిని విచారించారు. ఈక్రమంలో బుధవారం లోకేష్ రెడ్డి, సునీల్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి.. విచారణ నిమిత్తం కడప సీసీఎస్‌కు తరలించినట్లు సమాచారం. అయితే ఆదివారం రాత్రి ప్రొద్దుటూరులోని బీజీఆర్ లాడ్జిలో జరిగిన ఈ హత్యకు సంబంధించి.. పప్పీకి లోకేష్‌రెడ్డికి మధ్య ఏమైనా పాతకక్షలు ఉన్నాయా లేక మద్యం మత్తులో మాటామాటా పెరిగి ఘర్షణ పడి హత్య చేశారా అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది.

విద్యార్థులను చితకబాదిన అధ్యాపకుడు

- కళాశాల వద్ద తల్లిదండ్రుల వాగ్వాదం


విద్యార్థుల ఒంటిపై తేలిన వాతలను చూపుతున్న తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇద్దరు విద్యార్థులను అధ్యాపకుడు చితకబాదడం వివాదాస్పదంగా మారింది. ఉదయం 10 గంటల సమయంలో విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటుండగా సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులు చిన్న, కృపాకుమార్‌లు అల్లరి చేస్తుండగా అధ్యాపకుడు శ్రీనివాసులరెడ్డి వారిని వారించారు. అయినా వారి అల్లరి కొనసాగడంతో అధ్యాపకుడు మందలించాడు. ఓ విద్యార్థి తిరగబడడంతో ఆగ్రహించిన అధ్యాపకుడు బెత్తంతో చితకబాదాడు. దెబ్బలపై స్ప్రే చేసి ఇంటికి పంపారు. ఆ దెబ్బలు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్నం 1.30 గంటలకు కళాశాలకు వచ్చి అధ్యాపకులను నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలకు చేరుకుని ఆ కళాశాలపై చర్యలు తీసుకుని అధ్యాపకుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల వద్ద గొడవ జరుగుతుండడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకుడు మాట్లాడుతూ విద్యార్థులు అల్లరి చేస్తుండడంతో అధ్యాపకుడు మందలించాడని.. ఓ విద్యార్థి తిరగబడడంతో బెత్తంతో కొట్టినట్లు తెలిపారు. ఓ విద్యార్థి సోదరుడు కళాశాలకు చేరుకుని తమ వాడు అల్లరి చేయడం తప్పని, తప్పు చేసినవారిని దండించడం సబబేనని తెలిపినట్లు పేర్కొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌లో సెలవుదినాలు తొలగించాలి : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి యాక్షన్‌ప్లాన్‌లో సెలవు దినాలు తొలగించి సవరణ ప్లాన్ విడుదల చేయాలని ఏపీటీఎఫ్ (అమరావతి) రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారాలు పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లినా విద్యార్థులు మాత్రం రారన్నారు. స్థానిక అవసరాల మేరకు ప్లాన్‌ను పూర్తిస్థాయిలో మార్చుకునే వెసులుబాటును జిల్లా విద్యాశాఖ డీసీఈబీలకు కల్పించాలని కోరారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య


ఉమామహేశ్వర్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన సంగటి ఉమామహేశ్వరరెడ్డి (26) అనే యువ రైతు అప్పులబాధతో బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వ్యవసాయ పనులు చేసుకోవడంతో పాటు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత మూడేళ్లుగా నాలుగు ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేసేవాడు. పంటలు సక్రమంగా పండక పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో బుధవారం తెల్లవారుజామున రోజువారీలో భాగంగా నడకకు వెళుతున్నట్లు ఇంటిలో చెప్పి బయల్దేరాడు. పుష్పగిరి రోడ్డులో ఉన్న గ్రామ సమీపంలో విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన బంధువులు స్థానికులు అక్కడకు చేరుకుని ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతి చెందాడు. సీఐ పురుషోత్తంరాజు పోలీసులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

600 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత



బద్వేలుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరారెడ్డి కళాశాల వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు నుంచి నెల్లూరు క్రిష్ణపట్నంకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గుంతపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిఘా ఉంచారు. మైదుకూరులోని నవదుర్గ రైస్ ట్రేడర్స్‌కు చెందిన ఏపీ16పీఈ 3219 అనే లారీలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డుకుని తనిఖీ చేశారు. లారీలో 600 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళకు గాయాలు

పెండ్లిమర్రి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో మహిళకు గాయాలయ్యాయి. ఏనుగువారి పల్లెకు చెందిన పేర్ల నాగపార్వతి ఇంటి ముందర ఉండగా పిడుగు పడింది. దీంతో ఆమె అపస్మారకస్థితిలో పోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు.

కమలాపురం మండలంలో గేదె మృతి

కమలాపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లెలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనిమల రాఘవ అనే రైతు ఇంటి సమీపంలో చెట్టు కింద గేదెను కట్టేశాడు. ఆ చెట్టుపై పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గేదె రూ.లక్షా 20వేలు విలువ చేస్తుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

గండికోట పర్యాటక అభివృద్ధికి అడుగులు : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్, సంబంధిత ప్రాజెక్టు ఏజెన్సీతో కలసి గండికోట పర్యాట అభివృద్ధిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రంగా భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించేలా సృజనాత్మకమైన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యాటకం అనేది ప్రజలకు వినోదం పంచడంతో పాటు వారి భద్రత సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే పోలీసు భద్రతలో భాగంగా 24/7 అందుబాటులో ఉన్న ఒక ఔట్‌పోస్టు నిర్వహణలో ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ , టూరిజంశాఖల సమన్వయంతో పర్యాటక కేంద్రంలో పర్యాటకులకు సంతృప్తికరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. అనంతరం గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు రిపోర్టుకు సంబంధించిన వివరాలను పీపీటీ ద్వారా కలెక్టర్ పరిశీలించి.. టూరిజం శాఖ అధికారికి పలు సూచనలు ఇచ్చారు.

కబ్జాకు గురైన దేవస్థానం స్థలాలను స్వాధీనం చేసుకుంటాం

- అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లలో దేవదాయశాఖకు సంబంధించి అన్యాక్రాంతమైన భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ జిల్లా అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జున ప్రసాద్ తెలిపారు. వేంపల్లెలోని వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి బస్టాండు పక్కన ఆక్రమణలో ఉన్న 71 సెంట్ల స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అక్కడ నుంచి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశా రు. కొన్ని ఇళ్లకు నోటీసులు అందించారు. త్వరలోనే ఆక్రమించిన స్థలం ఖాళీ చేయాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఎక్కడా కూడా దేవదాయశాఖకు సంబంధించి ఆక్రమణలు ఉన్నా స్వాధీనం చేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అక్కడి ప్రజలు ఈ స్థలానికి సంబంధించి జిల్లా అధికారులతో రీసర్వే చేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్వేచేయిస్తామన్నారు. ఆక్రమించిన స్థలాలను వెంటనే ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈవో విశ్వనాదరెడ్డి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వల భవిష్యత్తు

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ గురుకులం క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. వైస్‌చాన్సలరు మాట్లాడుతూ యూనివర్శిటీలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. క్రమశిక్షణతో మెలగడం, గ్రంథాలయం వినియోగంచుకోవడం, అధ్యాపకుల సలహాలు నిరంతరం అమలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ప్రగతికి మార్గాలన్నారు. ఎండీఏ విభాగం ప్రొఫెసరు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భయపడకుండా ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగాఎదుర్కోవాలన్నారు. అనంతరం ప్రొఫెసరు సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ అమృత్ ప్రసాద్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జాతీయస్థాయి క్రీడలకు కేజీబీవీ విద్యార్థినులు


క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రత్యేక అధికారిణి ఫణిశ్రీ

అట్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అట్లూరు కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్ 14, బేస్‌బాల్ అండర్ 17 మరియు ఆట్యపాట్య జాతీయస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినులు లక్ష్మీ ప్రసన్న, తనూజా, బత్తల దీపిక, అమరావతి, రిషిత, సుధా ఎంపికైనట్లు తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీలతో కలిసి అభినందించారు.

'నిఘా' నేత్రాలు

- నేరస్తులను వెంటాడుతున్న సీసీ కెమెరాలు
- పలు కేసుల ఛేదనలో తోడ్పాటు
- రైల్వేకోడూరులో సీసీ కెమెరాల పనితీరుపై ప్రశంసలు


కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీఐ హేమసుందర్ రావు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో ఎన్నో సంచలనమైన కేసుల ఛేదనలో నిఘా నేత్రాలు కీల కపాత్ర పోషిస్తున్నాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ వీధి, టోల్‌గేట్, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్కెట్ యార్డు వంటి ప్రధాన ప్రదేశాలలో నిఘా నేత్రాలు నేరస్తులను వెంటాడుతున్నాయి. వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, క్రయవిక్రయాల్లో రాష్ట్రంలో గుర్తింపు పొందిన రైల్వేకోడూరు పట్టణంలో నేరాల కట్టడికి పోలీసు యంత్రాం గం వినియోగిస్తున్న నిఘా కెమెరాల పనితీరు బేష్ అంటున్నారు కోడూరు వాసులు. నేరాలను అరికట్టడానికి 2017 ఆగస్టు నేలలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ అట్టాడ బాపూజీ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోలు గదిని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన కూడలి, రహదారి, వీధుల్లో ఆధునాతనమైన 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సహాయం లేకుండా అప్పటి సీఐ సాయినాథ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, భక్తవత్సలం కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేసి ఏపీఎండీసీ సంస్థ ద్వారా 9 లక్షల 60వేల రూపాయిలు మరియు దాతల సహకారంతో రూ.5 లక్షలు మొత్తం 15 లక్షల రూపాయిలు నిధులు సేకరించి సీసీ కెమెరాలు విస్తృతంగా ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పట్ట ణంలోని పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నలుగురు పోలీస్ సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో అనేక కేసుల ఛేదించిన సంఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం సీసీ కెమెరాలు కొన్ని మరమ్మతులకు గురయ్యా యి. వీటికి మరమ్మతులు చేయడంతో పాటు పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలను అరికట్టాలంటే సీసీ కెమెరాలను పూర్తిగా ఏర్పాటు చేయాలని రైల్వేకో డూరు ప్రజలు కోరుకుంటున్నారు.


బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సీసీ కెమెరాల ద్వారా ఛేధించిన కేసుల వివరాలు

- 2018 సంవత్సరంలో రంజాన్ పండుగ రోజు పాత బస్టాండ్ సినిమా హల్ వద్ద ముస్లిం యువకుడిని దారుణంగా హత్య చేసి పారిపోయారు. సీసీ కెమెరాల ద్వారా హంతకులు ఉపయోగించిన వాహనాన్ని గుర్తించి అప్పటి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం చెన్నైకు వెళ్లి హంతకులను పట్టుకుని కేసును ఛేదించారు. కేసును ఛేదించిన ఎస్ఐలకు ఐజీ ప్రతిష్టాత్మకమైన ఏబీసీడీ అవార్డును అందించారు.
- పట్టణంలో కొత్త కోడూరు ప్రాంతంలో సంచలనమైన నాయుడు హత్య కేసును విచారిస్తుండగా హంతకుడు వెళ్లిన మార్గాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసు ఛేధించారు.
- పట్టణంలో ఓ వ్యాపారి బ్యాంకు నుంచి 3 లక్షల రూపాయిలు తీసుకుని వస్తుండగా కొంతమంది అతన్ని దారి మళ్లించి నగదు ఉన్న బ్యాగును అపహరించారు. సీసీ కెమెరాల ద్వారా గంట వ్యవధిలో నింధితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టణానికి చెందిన ఓ మహిళ తిరుపతి నుంచి వచ్చి ఆటోలో రూ.లక్ష నగదు 20 వేల విలువైన మొబైల్ ఫోన్‌కు మరిచిపోయి వెళ్లిపోయారు. బాధితులు కమాండ్ కంట్రోలుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. బస్టాండ్ వద్ద ఉన్న కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించి బాధితులకు నగదు అందజేశారు.

- పట్టణంలో చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారిని రిమాండ్‌కు తరలించారు. కొంతమంది యువతులు మిస్సింగ్ కేసులను నిఘా కెమెరాల ఆధారంగా ఛేదించి పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలో జరిగిన పలు యాక్సిడెంట్ కేసులను సీసీ కెమెరాల ద్వారా ఛేదించిన సంఘటనలు చాలా ఉన్నాయి.

సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నాం.

పట్టణంలోని పలు రద్దీ ప్రదేశాలలో కెమెరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. గంగమ్మ తల్లి కమిటీ సభ్యుల సహకారంతో నూతనంగా 8 కెమెరాలు ఏర్పాటు చేశాం. పట్టణంలో నేరాలు అరికట్టాలంటే 40 కెమెరాలు అవసరం. అన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలంటే సుమారు 10 లక్షల రూపాయిలు నిధులు అవసరం. దాతలు ముందుకు వస్తే త్వరలో రైల్వేకోడూరు పట్టణంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

- హేమసుందర్ రావు, రైల్వేకోడూరు అర్బన్ సీఐ

గంగమ్మకు పూజలు



గంగమ్మకు హారతి ఇస్తున్న రైతులు

సుండుపల్లె, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి జలాశయం పూర్తిగా నిండడంతో బుధవారం ముడుంపాడు పంచాయతీలోని రైతులు అమ్ము నాయక్ ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మకు పూజలు, హారతులు ఇచ్చారు. టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు విద్యార్థిని ఎంపిక



నందలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు మండలంలోని అన్నమాచార్య అకాడమీ విద్యార్థిని ఓజస్వి గంగ ఎంపికైనట్లు సమ్మెట శివప్రసాద్, మాడపూరి హేమలత తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత నెల రోజులుగా వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న పోటీల్లో సెగ్గుతూ రాష్ట్ర స్థాయికి చేరుకున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 11న గీతాజయంతి సందర్భంగా ప్రొద్దుటూరులో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమామహేష్, అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

రాజంపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మౌనిక



రాజంపేట టౌన్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : రాజంపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మౌనికను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రస్తుతం రాజంపేట కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఒంటిమిట్ట సీఐగా బాబు

ఒంటిమిట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఒంటిమిట్ట, సిద్దవటం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కృష్ణంరాజునాయక్ కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత నెల 28న కుమ్మరపల్లి పంచాయతీ గొల్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహబూబ్‌బాషా (45) తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసున్నామన్నారు.

పరామర్శ

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లా జనసేన లీగల్‌సెల్ అధ్యక్షుడు కరుణాకర్‌రాజును బుధవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాదులో చికిత్స చేసుకుని ఇంటికి రాగా జనసేన పార్టీ పార్లమెంట్ నాయకులు రామా శ్రీనివాస్, అన్నమయ్య జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, షేక్ సలీం, అబ్బిగారి గోపాల్ పరామర్శించారు.

12న ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలో అభివృద్ధి, తాగునీరు, ఉపాధి, వైద్యం, విద్య, గ్రామీణ రోడ్లు, విద్యుత్‌పై ప్రత్యేకంగా చర్చించి మండల అభివృద్ధిపై చర్చించనున్నామని వివరించారు.

భూముల పంపిణీలో అక్రమాలు!

● విచ్చలవిడిగా వసూళ్లు ● నిరుపేదలకు అందని అసైన్‌మెంట్ భూములు



యర్రగుడి గ్రామంలో అసైన్‌మెంట్ ద్వారా పట్టాలు ఇచ్చిన భూమి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ హక్కు చట్టం అపహాస్యం పాలవుతోంది. నిరుపేదలకు అందాల్సిన భూములు అధికారులు, నాయకుల అవినీతి కారణంగా ఉన్నవారికే అందుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భూమి లేని నిరుపేదలను గుర్తించి, వారి జీవనోపాధి కోసం రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని 2006లో ప్రభుత్వం చట్టం చేసింది. అయితే, గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూ పంపిణీలో ఓ పార్టీ కార్యకర్త తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో భూములు పొందినట్లు సమాచారం. 2023-24లో మండలంలో 278 మందికి ప్రభుత్వం భూమి పంపిణీ చేసింది. ఆ సమయంలో పలువురు వీఆర్వోలు పట్టాలు ఇప్పిస్తామని చెప్పి పలువురి నుంచి డబ్బు వసూలు చేశారు. అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చేందుకు బూడిదగుంటపల్లెకు చెందిన ఓ రైతు నుంచి సుమారు 70 వేల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. కాకుళవరం పంచాయతీలో పట్టాలు ఇస్తామని 39 మంది నుంచి డబ్బు వసూలు చేసి, వారినే అర్హులుగా ఎంపిక చేశారు. దిన్నెపాడు పంచాయతీలో 35 మంది. దప్పేపల్లె పంచాయతీలో 60 మంది ఎస్సీలు, మద్దిరేవుల పంచాయతీలో 65 మంది, కుర్నూతల పంచాయతీలో 60 మందికి పైగా, బి యర్రగుడి పంచాయతీలో 40 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. కాగా, వీరిలో ఎవరికీ ఇప్పటిదాకా పట్టాలు మంజూరు కాలేదు. మద్దిరేవుల గ్రామానికి చెందిన కొందరు 20 ఏళ్ల క్రితం బతుకుదెరువుకోసం రాయచోటికి తరలి వెళ్లగా , వారి పేర్లు అసైన్‌మెంట్ కమిటీ జాబితాలో కనిపించడం విచిత్రం. ఈ విషయంపై వారిని ప్రశ్నించగా ఆ విషయమే తమకు తెలియదంటున్నారు. రెవెన్యూ సిబ్బంది తమ ఇష్టానుసారం నకిలీ నెంబర్లు, పేర్లు సృష్టించి భూములు కాజేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం గమనించిన కొందరు ఈ ప్రక్రియను అడ్డుకోవడంతో పట్టాల పంపిణీ నిలిపివేశారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే ఎవరెవరు ఎంతెంత మొత్తం వసూలు చేశారు. ఎవరు వసూలు చేయమన్నారన్న విషయాలు బయటకు వస్తాయని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో మండలంలోని ముగ్గురు వీఆర్వోలు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

నిరుపేదలకు భూములు అందలేదు



మాది మద్దిరేవుల హరిజనవాడ. దరఖాస్తు చేసుకున్నా నాకు భూమి ఇవ్వలేదు. వైసీపీ హయాంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు చెప్పిన వారికి మాత్రమే భూములు దక్కాయి. నిరుపేదలను గుర్తించి అసైన్‌మెంట్ భూమి ఇవ్వాలి

-రమణ మద్దిరేవుల హరిజనవాడ

ఆ వివరాలు నాకు తెలియదు

గతంలో జరిగిన భూ పంపిణీ వివరాలు నాకు తెలియదు. నేను వచ్చి నెల రోజులు కావస్తోంది. ఇకపై ఎలాంటి అక్రమాలు జరగకుండా చూస్తా. ప్రస్తుత ప్రభుత్వంలో అసైన్‌మెంట్ వస్తే నిజమైన నిరుపేద లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేస్తా.

- శ్రీనివాసులు, తహసీల్దార్

తుఫాన్ తీరం దాటినా.. రైల్వేకోడూరును వీడని వర్షం

● అరటి పంట అతలాకుతలం ● మామిడి తోటల్లో నిలిచిన నీరు ● రోడ్లన్నీ జలమయం ● మరో తుఫాన్‌తో పొంచి ఉన్న గండం



రైల్వేకోడూరు ప్రధానదారిలో వర్షపు నీరు

రైల్వేకోడూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) ఫెంగల్ తుఫాన్ తీరం దాటి వెళ్లిపోయినా రైల్వేకోడూరును వర్షం వీడడం లేదు. బుధవారం భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మామిడి తోటల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. గుంజన నదిలో గంగమ్మ శాంతించలేదు. చెరువులు అలుగులు పొర్లుతున్నాయి. ఈ పరిస్థితులో మరో తుఫాన్ రానుందన్న హెచ్చరికలు రైతులు భయాందోళనకు గురి చేస్తున్నాయి.. భూమి నానిపోతే మామిడి చెట్లు కూడా పడిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. బొప్పాయి మొక్కలు ఇప్పటికే కుళ్లిపోతున్నాయి. .

రాజంపేట : పట్టణంలో. బుధవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే వర్షం పడుతుండడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతా ల్లో ఎక్కువ వర్షం కురిస్తే వరద తమ గ్రామాలను ముంచేస్తుందేమోనని ఎగువ, దిగువ మందపల్లెవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే వర్షం గురువారం కొనసాగితే చుట్టుపక్కల చెరువులకు భారీగా నీరు చేరే అవకాశం ఉంది.

పెనగలూరు: పెనగలూరు మండలంలో బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి భారీ వర్షం ప్రారంభమైంది. . వీధులన్నీ బురదమయమయ్యాయి.. కట్టవారిపల్లె మార్గంలోని పాఠశాల ప్రాంగణంలోకి భారీగా వర్షపునీరు చేరింది.

ఒంటిమిట్ట : మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఈ వర్షం ఊరటనిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువన మంటపంపల్లె, చింతరాజుపల్లె, నడింపల్లె గ్రామాల్లో భారీగా వర్షం కురవడంతో చెరువుకు నీరు చేరుతుందన్న ఆనందంలో ఉన్నారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఐక్యవేదిక నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడులను నిరసిస్తూ బుధవారం రాయచోటిలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీఅయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి, లక్ష్మీకర్, మానవత చైర్మన్, బీజేపీ నాయకుడు శివగంగిరెడ్డి, పలు హిందూ సంఘాల సభ్యులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజు మాట్లాడుతూ కరోనా సమయంలో ఎన్నో సేవలందించి బంగ్లాదేశ్ తిరిగి కోలుకోవడంతో కీలకపాత్ర పోషించిన హిందూ ధార్మిక సంస్థ ఇస్కాన్ నిర్వాహకులైన చిన్మయి కృష్ణదాస్ ప్రభు పట్ల ఆ ప్రభుత్వ వైఖరి అక్కడి హిందూ ప్రజల పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. బంగ్లాదేశ్ హిందూ సమాజానికి కులాలు, పార్టీలకు అతీతంగా బాసటగా నిలవాలని పిలుపు నిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యరాజు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరసింహులు, హిందూ చైతన్య వేదిక జిల్లా సహ సంయోజక్ సగల సుజన్ కుమార్, సాగర్, నందగోపాల్, వీరారెడ్డి, నాగిరెడ్డి, రాజా, భువన విజయ, హనుమాన్ నాయక్, రవీంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు

నందలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. 391 మంది రైల్వే కార్మికులు ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. గురు, శుక్రవారాల్లో కూడా ఈ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ ఆఫీసర్‌గా మధుసూదన్‌రావు, పోలింగ్ సూపరింటెండెంట్‌గా శివలింగం, అసిస్టెంట్‌గా లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ భాస్కర్‌రావు, స్థానిక ఏఎస్‌ఐ శంకర్‌నాయక్, జీఆర్‌పీ పోలీసులు బందోబస్తు నిర్వహిం చారు. దేశవ్యాప్తంగా 17 రైల్వే జోన్లలో జరిగే ఈ ఎన్నికల్లో ఐదు కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయని, 35 శాతం ఓట్లు సాధించిన యూనియన్లకు గుర్తింపు లభించనుంది.

హిందూ సనాతన ధర్మాన్ని పాటించాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు హిందూ సనాతన ధర్మాన్ని పాటించి భగవంతుడి కృపకు పాత్రులు కావాలని శ్రీ ఆదిశంకరాచార్య శారదా లక్ష్మీ నరసింహ పీఠాధిపతి స్వయంప్రకాశ్ సచ్చిదానంద స్వామిజీ పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రం శ్రీ మఠం, హరిహరాపురం, మఠం నుంచి బుధవారం లక్కిరెడ్డిపల్లెకు విచ్చేశారు. దొరిచెరువులో గంగ పూజ చేశారు. గంగమ్మ ఆలయంలో కుంకుమార్చన, దివ్యసత్సంగం, లలితా త్రిపురసుందరి నవావరణ పూజలు చేశారు. అనంతరం శివ పురాణం, ఆధ్యాత్మిక చింతనపై ప్రసంగించారు. హిందూ సనాతన ధర్మకర్త నూకల రవీంద్ర, బీజేపీ నాయకుడు కృష్ణ ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ నాగేంద్రరెడ్డి, శివాలయ ప్రధాన అర్చకుడు హరిశర్మ, ఆలయ కమిటీ సభ్యులు కడియాల వెంకటప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

గుంజన నది రక్షణ గోడ నిర్మాణానికి కృషి



నరసరాంపురం లో పర్యటిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంజన నది రక్షణ గోడ నిర్మాణానికి కృషి చేస్తున్నామని అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. పట్టణంలోని నరసరాంపేటలో బుధవారం .ఆయన మాట్లాడుతూ నరసరాంపేట వద్ద రక్షణ గోడ విషయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అధిక వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎస్మా పరిధిలోకి 104 సేవలు' దుర్మార్గం

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 104 సేవలను ఎస్మా పరిధిలోకి తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గం అని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు అన్నారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగులు కొంత కాలంగా ఆందోళన చేస్తున్నారని వివరించారు. వేతన బకాయిలు, పెండింగ్ బిల్లులు, మూడేళ్ల ఇంక్రిమెంట్లు, పీఎఫ్ యాజమాన్య వాటా చెల్లించాలని, శ్లాబ్ ప్రకారం వేతనాలు చెల్లించాలనే డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తున్నారని వివరించారు. వారి కోర్కెలు తీర్చకపోగా, రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగిస్తానని ప్రకటించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్మా ఉత్తర్వులు ఎత్తివేసి 104 ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పశువుల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు మాలకొండయ్య

రామాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశువర్ధకశాఖ ఉప సంచాలకులు మాలకొండయ్య హెచ్చరించారు. మండలంలోని సరస్వతిపలి, రాచపల్లి పంచాయతీల్లో ఆయన పర్యటించారు. సరస్వతిపల్లి దళితవాడలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో గొర్రెలకు పిల్లి నరక(పీపీఆర్) రాకుండా టీకా లు వేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి ప్రవీ ణ్ కుమార్‌రెడ్డి, పశువర్ధకశాఖ సిబ్బంది, పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

రక్షణ గోడలకు మరమ్మతులు



కాలువ గోడలకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

సుండుపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు ఎడమ కాలువకు బుధవారం మరమ్మతులు చేసినట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండడంతో ప్రతి రైతుకు సాగు నీటిని అందించాలన్న లక్ష్యంతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. నీటి సంఘం ఎన్నికల అనంతరం పూర్తి స్థాయిలో కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేస్తామని తెలియజేశారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్ల తొలగింపు



రోడ్డుకు అడ్డంగా పడివున్న చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చిట్వేలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షం కారణంగా రాపూరు - చిట్వేలి ఘాట్‌రోడ్డులో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో తొలగించారు. బుధవారం ఆ మార్గంలో వెళుతూ పరిస్థితిని గమనించిన ఆయన వెనువెంటనే ఎక్స్‌కవేటర్‌ను పిలిపించి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించడంతో వాహనదారులకు ఇబ్బంది లేకుండా పోయింది.

30 లోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ చంద్రానాయక్

గాలివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. బుధవారం మండలంలోని వందికుంట పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ, టమోటా పంటలకు డిసెంబరు 15వ తేదీలోగా, వరి పంటకు డిసెంబర్ 30వ తేదీలోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. వేరుశనగ సాగు రైతులు వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలతో పాటు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొద్ది రోజులు వరి కోతలు నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేడీ ఆఫీస్ టెక్నికల్ ఏవో వెంకటమోహన్, లక్కిరెడ్డిపల్లె సహాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికరి గౌతమి, ఏఈవో అపర్ణ, వందికుంట రైతులు పాల్గొన్నారు.

కోదండరాముడికి సుగవాసి పూజలు



కోదండరాముడి సన్నిధిలో సుగవాసి

ఒంటిమిట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెర్లోపల్లెలో ఉన్న కోదండరామస్వామి ఆలయాన్ని బుధవారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దర్శించుకున్నారు. అనంతరం మండల అభివృద్ధిపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా చెర్లోపలెకు చెందిన వైసీపీ నాయకులు ఆయనతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



రిగ్గుకు పూజలు చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం నారాయణరెడ్డిపల్లె గ్రామం ముద్దినేనివాండ్లపల్లెలో బోరు పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు విస్తృతంగా బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూరెకరాల రంగారెడ్డి, రామకృష్ణ, తెలుగు యువత హరినంద, ఆనంద రెడ్డి, అనగాని రమణయ్య, గొడ్డిండ్ల అంజనేయులు, పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

రాయచోటి టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సంబేపల్లె మండలానికి చెందిన పీ. శేషాద్రిరెడ్డికి రూ.31 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు.

ఆరుగురికి సీఎం సహాయనిధి మంజూరు

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో ఇటీవల వివిధ వ్యాధులకు గురై శస్త్ర చికిత్సలు చేయించుకున్న ఆరుగురికి సీఎం సహాయనిధి మంజూరు చేసినట్లు టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. కె.వెంకటరమణకు రూ. 3,38,757 రూపాయలు, ఎం.సునీతకు రూ. 30 వేలు, ఎ.కృష్ణయ్యకు రూ. 55,178, బి.కుచేలయ్యకు రూ. 30 వేలు, ఒంటిమిట్ట చెంగయ్యకు రూ. 3,53,599, జి.భువనేశ్వరికి రూ. 2,50,564 మంజూరైందన్నారు. ఈ మేరకు మంజూరైన చెక్కులను వారి అందజేశామన్నారు. నియోజకవర్గంలో అనారోగ్యంపాలై వైద్య చికిత్సలు చేయించుకున్నవారు బిల్లులను, వివరాలను తమకు అందజేస్తే సీఎం సహాయనిధి మంజూరుకు కృషి చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుగవాసి విజ్ఞప్తి చేశారు.

నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపీడీవో రెడ్డెయ్య సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో నీటి సంఘం ఎన్నికలపై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు కింద భూములు ఉన్న రైతులను 6 నియోజక వర్గాలుగా చేసి, నీటి వినియోగదారుల సంఘంలో చేర్చి వారి ఏకాభిప్రాయాల ద్వారా నీటి సంఘం ప్రెసిడెంట్, వైస్ ప్రసిడెంట్‌ను ఎన్నుకో వాలన్నారు. లేదంటే సభ్యులందరూ చేతులెత్తి ఎన్నుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లును కూడా ఎన్నుకోవాలని తెలియజేశారు. నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరపాలని ఏదైన సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ 2 వెంకటసుబ్బయ్య, మండల ఇరిగేషన్ ఆఫీసర్ మహబూబ్ బాషా, ఏఓ రమేష్‌బాబురావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళి



ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న శ్రీవెంకటేశ్వర కళామండలి కళాకారులు

రాయచోటి టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో బుధవారం శ్రీ వెంకటేశ్వర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో కళాకారులు నివాళులర్పించారు. . ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, కృష్ణయ్య, తపలిస్ట్ రామాం జనేయు లు, రాంబాబు, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, రామచంద్ర, కిశోర్ కుమార్ రెడ్డి తదితర కళాకారులు పాల్గొన్నారు.

పిల్లలను తల్లి దరికి చేర్చినందుకు సబ్‌కలెక్టర్‌కు ప్రశంసలు

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దూరమైన పిల్లలను తిరిగి తల్లి దగ్గరకు చేర్చేందుకు కృషి చేసిన రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియాదేవిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రశంసించారు. రాజంపేటకు చెందిన ఓ మహిళకు భర్తతో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక పాఠశాలలో చదువుతున్న ఆమె ఇద్దరి పిల్లలను మంగళవారం వారి తండ్రి తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయాడు. పిల్లలు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె సబ్‌కలెక్టరు వద్ద తన గోడు వెళ్లబోసుకుంది. వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ పిల్లల ఆచూకీ కనుగొనేందుకు ఐసీడీసీఎస్ పీడీ, సీడీపీవోను, పోలీసుల సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసింది. ఆ బృందం బెంగుళూరులో తండ్రి వద్ద ఉన్న పిల్లలను తీసుకువచ్చి బుధవారం తల్లికి అప్పగించింది. ఈ విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు హరినాథ్, రమణ, సాధిక్, సోషల్ వర్కర్ శైలజ తదితరులను సబ్‌కలెక్టర్ అభినందించారు. పిల్లలను తల్లిదగ్గరకు చేర్చిన సబ్‌కలెక్టర్ నైదియాదేవి కృషిని కలెక్టర్ శ్రీధర్ ప్రశంసించారు.

బతుకు దెరువు కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు

- కువైత్‌లో చౌడసముద్రం వాసి మృతి..
- శోకసంద్రంలో కుటుంబీకులు


మృతి చెందిన ఆజాద్‌బేగ్

ములకలచెరువు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైత్‌కు వెళ్లిన చౌడ సముద్రం వాసి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామస్థుల కథనం మేరకు... ములకలచెరువు మండలం చౌడ సముద్రం వాసి ఆజాద్‌బేగ్(45) బతుకుదెరువు కోసం రెండేళ్ల కిందట కువైత్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య మక్బూల్, కుమార్తె నగీనా, కొడుకు నాసీర్‌బాషా ఉన్నారు. ఈ క్రమంలో కువైత్‌లో పనిచేస్తూ అజాద్‌బేగ్ ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయాడు. సహచరులు గమనించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం కుటుంబీకులకు సమాచారం అందడంతో వారు విషాదంలో మునిగిపోయారు. కాగా ఆజాద్‌బేగ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య


మృతిచెందిన రామాంజులు

సంబేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగవద్దని తండ్రి, భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం బాలవారిపల్లెకు చెందిన రాయదుర్గం రామాంజులు (21) రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో భార్య, అతని తండ్రి మందలించినందుకు మనస్థాపానికి గురై మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లాడు. కాగా బుధవారం తెల్లవారే సరికి వారి మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

వైరల్ ఫీవర్‌తో చిన్నారి మృతి


దేవాన్షి (ఫైల్ ఫొటో)

పుల్లంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జ్వరం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సుమారు 15 నెలల చిన్నారి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూసింది. పుల్లంపేట మండలం చెర్లోపల్లె అరుంధతివాడకు చెందిన వెంకటేశ్, సాయితేజశ్రీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె దేవాన్షి వారం రోజులుగా దగ్గు, జలుబు, రక్తంలో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో కడపలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చి రాజంపేటలోని ప్రైవేటు డాక్టర్ వద్ద చూపించారు. ఎంతకీ తగ్గకపోవడంతో కడప రిమ్స్‌కు తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున చిన్నారి మృతిచెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

రేపటి నుంచి కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7 తేదీల్లో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కడప రీజనల్ పాలీటెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా యువకుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సాంకేతిక విద్యాశాఖ ఈ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప రీజియన్ పరిధిలోని 32 ప్రభుత్వ, ప్రైవేటు, ఫార్మసీ కళాశాలల నుంచి 140 ఆవిష్కరణలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 6వ తేది ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ సుబ్రమణ్యం హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమంగా నిలచిన 20 ఆవిష్కరణలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతికి రూ.10 వేలు నగదు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 550 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదర్శం.. ఆ క్యాంటీన్

- జిల్లా ఆసుపత్రిలో మెప్మా ఆసరాతో క్యాంటీన్
- స్వయం కృషితో అభివృద్ధి చేసిన లక్ష్మీదేవి
- ఇంటి భోజనం మరిపించేలా వంటలు
- పలువురు మహిళలకు ఉపాధి కల్పన


సమత క్యాంటీన్ బృందంతో బండి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉన్న క్యాంటీన్ మహిళలకు ఉపాధినిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్యాంటీన్‌ను 10 సంవత్సరాలుగా మహిళలే నిర్వహిస్తుండటం విశేషం. గతంలో జిల్లా ఆసుపత్రి వద్ద క్యాంటీన్‌లేక రోగులు, వారి బంధువులు బయట అధిక ధరలకు భోజనాలు కొనలేక ఇబ్బందులు పడేవారు. దీనిని గమనించిన అప్పటి కలెక్టర్ కోన శశిధర్ హయాంలో 'సమత పట్టణ మహిళా సమాఖ్య' ఆధ్వర్యంలో 2014లో జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) అధ్యక్షురాలు బండి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో క్యాంటీన్‌ను నిర్వహించే వారు. ఆమె మెప్మాలోని మహిళలను క్యాంటీన్‌లో పనికి పెట్టుకుని పేదప్రజలను, రోగులను దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరలకే రుచికరమైన భోజనం అందించాలని సంకల్పం పెట్టుకున్నారు. క్యాంటీన్ ప్రారంభంలో రోజుకు రూ.200 నుంచి రూ.300 వ్యాపారం మాత్రమే జరిగేది. అయినా ఆమె నిరుత్సాహ పడకుండా కష్టాన్ని నమ్ముకుని రోగుల కడుపు నింపాలని దృఢ నిశ్చయంతో ఇంటిని మరిపించే విధంగా భోజనాలను తయారు చేస్తూ రోగులు, రోగుల బంధువులతో మన్ననలు పొందుతూ వచ్చారు. కరోనా సమయంలో కూడా రోగులకు భోజన సౌకర్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. నైట్ షెల్టర్‌లో ఉండేవారికి రోజుకు ఒక్కో భోజనం రూ.25కే వారు చెప్పిన మెనూతోనే భోజనం ఇచ్చేవారు. ఇలా ఒక సంవత్సరం పాటు నైట్‌షెల్టర్ వారికి భోజనాలు పంపించారు.

ఇంటిని మరిపించే భోజనమే లక్ష్యం - బండి లక్ష్మీదేవి, యజమానురాలు



మా క్యాంటీన్‌కు వచ్చే రోగులు, వారి బంధువులకు ఇంటిని మరిపించే విధంగా భోజనాలు ఇవ్వడమే మా లక్ష్యం. నాతోపాటు పనిచేసే మహిళల సహ కారంతోనే క్యాంటీన్‌లో ఇంటిని మరిపించే భోజనాలను వండుతున్నాం. క్యాంటీన్‌లో ఆరుగురు మహిళలు పనిచేస్తున్నారు. మా స్టాఫ్‌కు మహిళా దినోత్సవం రోజున చిరుసన్మానం చేసి బట్టలు అందిస్తాను. దసరా పండుగ సందర్భంగా ప్రతి ఏటా బోనస్ ఇచ్చి వారిని గౌరవిస్తాను. మెప్మావారు అందించే ఆర్థిక ఆసరాతో మహిళలు అభివృద్ధి చెంది స్వయంకృషితో ఆర్థికంగా ఎదగాలన్నదే నా ఆశయం.

మెప్మాలో సభ్యురాలిగా మొదలై..

లక్ష్మీదేవి 2007 నుంచి మెప్మాలో సభ్యురాలుగా ఉంటూ వారి గ్రూపునకు లీడర్‌గా కొనసాగారు. 2011వ సంవత్సరంలో ఆమె లీడర్‌గా నిర్వహిస్తున్న పనితీరును చూసి అధికారులు టీఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా నియమించారు. అప్పటి నుంచి ఆమె మహిళల అభివృద్ధికి కావాల్సిన ఎన్నో సూచనలు, సలహాలు అందించారు. అనేక సంవత్సరాలుగా ఆమె మహిళల అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు. ఆమె సేవా దృక్పథానికి మెచ్చి అధికారులు కరోనా అనంతరం క్యాంటీన్ బాధ్యతలు పూర్తిగా ఆమెకే అప్పగించారు. దీంతో లక్ష్మీదేవి మెప్మాలో రూ.2 లక్షలు లోను తీసుకుని క్యాంటీన్‌ను మరింత అభివృద్ధి చేశారు. క్యాంటీన్ ప్రారంభం నుంచి నేటి వరకు ఆరుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహించాలనుకుంటే వీరి క్యాంటీన్‌లోనే వంటకాలు తయారు చేయిస్తారు.

రాగి సంగటి బాగుంది

- మునెమ్మ, పేషంట్ బంధువు



ఈ క్యాంటీన్‌లో రాగిసంగటి, అందులోకి ఇచ్చే కూరలు చాలా బాగున్నాయి. ఇక్కడ పనిచేసే స్టాఫ్ కూడా వచ్చిన వారితో చాలా మంచిగా మాట్లాడుతూ వారికి ఏమికావాలో అడిగి మరీ వడ్డిస్తుంటారు. తక్కువ ధరలోనే మంచి రుచికరమైన సంగటి తినడం సంతోషం కలిగించింది.

కలిసికట్టుగా పనిచేస్తాం

- లక్ష్మి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్ ప్రారంభం నుంచి పనిచేస్తున్నాను. ఇందులో వచ్చే జీతంతోనే మెప్మాలో తీసుకున్న రుణం నెల నెలా కంతులు కడుతున్నాను. ఇక్కడ మేమంతా కలిసికట్టుగా పనిచేస్తూ క్యాంటీన్‌కు వచ్చేవారికి మంచి భోజనం అందిస్తున్నాం.

మాలో ఒకరిగా

- జయమణి, క్యాంటీన్ స్టాఫ్

నేను ఈ క్యాంటీన్‌లో ఏడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. మా యజమానురాలు మాలో ఒకరిగా కలిసిపోయి పనిచేస్తున్నారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి మంచి రుచికరమైన భోజనం అందించాలని కోరుకుంటారు.

కడప, రాయచోటిలో...

డ్రగ్స్ నియంత్రణ విభాగాలు

- ఒక్కో జిల్లా కార్యాలయంలో ఎస్ఐ సహా సిబ్బంది
- రీజనల్ స్థాయిలో సీఐ అధికారి పర్యవేక్షణ
- తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు
- ఫిర్యాదులు చేయడానికి 1972 టోల్ ఫ్రీ నంబరు
- నేరుగా అమరావతిలోని 'ఈగల్' స్టేషన్‌తో అనుసంధానం

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న డ్రగ్స్ చలామణిని నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సమాయత్తమవుతోంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న దశలో దీన్ని తుద ముట్టించేందుకు రాష్ట్ర స్థాయిలో 'ఈగల్' (ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్) వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మొత్తం వ్యవస్థను పర్యవేక్షించడానికి ఈగల్ చీఫ్‌గా (నార్కోటిక్) ఐజీ స్థాయి అధికారి ఆకే రవికృష్ణను నియమించారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించడంపై ఈగల్ దృష్టి సారించనుంది. ప్రధానంగా విద్యార్థులు, యువత ఈ మహమ్మారి బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు వివిధ రకాల వ్యూహాలను ఈగల్ అమలు చేయనుంది. ఇప్పటి వరకూ మాదక ద్రవ్యాలను నియంత్రించడానికి స్థానిక పోలీసులు మాత్రమే చొరవ చూపాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ బాధ్యతలను ఈగల్ తీసుకోనుంది. ఎస్డీడీ (ట్రాన్స్‌పోర్ట్, డెస్టినేషన్, డిమాండ్) పై ఈగల్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనుంది.

రెండు జిల్లాల్లో.. ఈగల్ సెల్‌లు

రాష్ట్ర స్థాయిలో ఈగల్ సమర్థవంతంగా పనిచేయడంతో క్షేత్ర స్థాయిలో జిల్లాల్లో ఈగల్ సెల్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈ విభాగం నేరుగా రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే ఎన్డీఎఫ్ (ప్రత్యేక రాష్ట్ర స్థాయి పోలీసు స్టేషన్) సెల్‌కు మాత్రమే బాధ్యత వహించనుంది. కడప, రాయచోటిలో ఈగల్ సెల్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ విభాగాల నిర్వహణను ఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. తగినంత మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌ను నియమించనున్నారు. ప్రాథమికంగా మత్తు పదార్థాల ఉనికి సంబంధిత సమాచారాన్ని రహస్య సేకరణ ద్వారా సమీకరించనున్నారు. జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నారు. అనంతరం పట్టుబడిన వారిని స్థానిక పోలీసు స్టేషన్లకు అప్పగించి విచారణ చేయించనున్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే ఈగల్ విభాగాలను రీజినల్ స్థాయిలో ఒక సీఐ పర్యవేక్షించనున్నారు. వీటన్నిటినీ నేరుగా అమరావతి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని ప్రధాన కేంద్రంతో అనుసంధానం చేస్తున్నారు. ఈగల్ నమోదు చేసే కేసులను విచారించి తొందరగా పరిష్కరించడానికి రాయలసీమకు సంబంధించి తిరుపతిలో ఒక ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారమేదైనా వుంటే 1972 టోల్ ఫ్రీ నంబరుకు చేరవేయవచ్చు. సమాచారం తెలిపే వ్యక్తులకు సంబంధించిన వివరాలను అత్యంత గోప్యంగా వుంచుతారు.

సంచలనం కలిగించిన పీలేరు సంఘటన

ఇటీవల మత్తు పదార్థాల వ్యసనపరులైన ఇద్దరు యువకులు పీలేరు సమీపంలో రైలు ఢీకొట్టడంతో దుర్మరణం పాలైన సంఘటన సంచలనం కలిగించింది. గంజాయి మత్తుకు బానిసలైన యాసిన్‌అలీ(17), కిరణ్‌కుమార్(20) ఇంటర్మీడియట్ విద్యార్థులు 2024 అక్టోబరు 23న రాత్రి రైలు పట్టాలపై కూర్చుని మత్తు పదార్థాలు సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఈ సంఘటనతో మాదక ద్రవ్యాల ఉనికిని ఈ ప్రాంతంలో మొదటిసారిగా తేటతెల్లం చేసింది. ఆ వెంటనే గంజాయి లేదా మాదక ద్రవ్యాల ఆనవాళ్ల కోసం కలికిరి, పీలేరు పట్టణాల్లో విస్తృతంగా గాలించినా లభ్యం కాలేదు. ఇలాంటి సందర్భాల్లో రహస్య విచారణ ద్వారా సమాచారం సేకరించడానికి ఈగల్ విభాగాలు కృషి చేయనున్నాయి. అంతేగాకుండా తల్లిదండ్రులకు, బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మొత్తం మీద మత్తు పదార్థాల నిర్మూలన కోసమే జిల్లా స్థాయిలోని విభాగాలు క్షేత్ర స్థాయిలో పనిచేయనున్నాయి.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్దమండ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) 'అక్కడ ఇళ్ల నిర్మాణా లెలా....?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి మదనపల్లి డివిజన్ హౌసింగ్ యంత్రాంగం స్పందించింది. పెద్దమండ్యం మండలంలో బుధవారం హౌసింగ్ ఈఈ వెంకటదాసు, డీఈ వెంకటరెడ్డి పర్యటించారు. జగనన్న లే ఆవుట్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వెలిగల్లు, పెద్దమండ్యం, పి.తురకపల్లి జగనన్న లే ఆవుట్‌ల్లో ఇళ్ల దశల వారీ నిర్మాణాలను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ, సౌకర్యాలపై గ్రామస్తులతో ఆరా తీశారు. అనంతరం కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఇంజనీరు అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి సిబ్బందితో వారు మాట్లాడుతూ మండలంలోని లే ఆవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి సూచనలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలకు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా రుణ సహాయం అందించాలన్నారు. పెద్దమండ్యం జగనన్న కాలనీల్లో వీధుల్లో వర్షపు నీళ్లు ఇంకిపోడానికి ఉపాధి నిధులతో మట్టి తరలించాలని, లేఅవుట్ ముందుభాగంలో చిన్న కాల్వ తీయాలన్నారు. ఇంజనీరు అసిస్టెంట్లకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల టార్గెట్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అన్ని కాలనీల్లో రోడ్లు, విద్యుత్తు, నీటిసౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. అర్హులైన నిరుపేదలు పీఎంఏవై పథకం ద్వారా పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంపీడీఓ, సర్పంచ్ బాష, హౌసింగ్ ఏఈ అక్రం, ఇంజనీరు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వ్-2కే24కు దరఖాస్తు చేసుకోండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

కురబలకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు అశ్వ్-2కె24కు దరఖాస్తు చేసుకోవాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 ఫిబ్రవరి 21, 22 తేదీల్లో అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ్-2కె24ను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏటా నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, WWW.mits.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ద్వారకనాథ్, కమాల్‌బాషా, ప్రదీప్‌కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, హారిక, హర్షిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, బస్సు, (ఇన్‌సెట్లో) మృతిచెందిన లారీ డ్రైవర్ పరమానంద్

రాజంపేటటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన రాజంపేట పట్టణ శివారులో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా... తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సును రాజంపేట భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో కడప నుంచి చెన్నైకు వెళుతున్న ఐషర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న నీరగుండి పరమానంద్(42) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన డ్రైవర్ లోకేశ్‌రెడ్డికి కుడికాలు, క్లీనర్ కె.నరసింహారెడ్డి చేతికి తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు తనూజ, ప్రవీణ్, సునీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ యల్లమ రాజు, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ ఖాసింపీరా, సిబ్బంది క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతిచెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని దేవర హిప్పిగిరికి చెందినవాడిగా గుర్తించారు.

కారు ఢీకొని మరొకరు...


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సదాశివరెడ్డి

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సదాశివరెడ్డి(53) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... కూరపర్తి గ్రామానికి చెందిన సదాశివ రెడ్డి జీవనం నిమిత్తం మదనపల్లెలో నివాసముంటున్నాడు. సొంతపనుల నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణ సమీపంలోని సబ్‌జైలు నిర్మాణ ప్రాంతంలో మదనపల్లె వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుబాంబులు పేలి పాడిఆవులకు తీవ్రగాయాలు

- సంఘటనపై విచారించిన పోలీసులు

బి.కొత్తకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అడవిపందుల కోసం అమర్చిన నాటుబాంబులు కొరికి రెండు పాడిఆవులు తీవ్రంగా గాయపడిన సంఘటనపై బుధవారం సీఐ రాజారెడ్డి విచారణ చేపట్టారు. మండలంలోని వేమిలేటి కోట పంచాయతీ కొత్తపల్లె శివారులో గుమ్మసముద్రం చెరువు మొరవ వద్ద కొత్తపల్లెకు చెందిన రైతు శివన్న మొక్కజొన్న పంట సాగుచేశాడు. తన పంటను అడవిపందులు ధ్వంసం చేస్తుండడంతో, బి.కొత్తకోట పట్టణం ఆలేటి పల్లె క్రాస్‌లో గుడిసెలు వేసుకుని నివాసం వుంటున్న వెంకటస్వామి చేత నల్లమందు, బెల్లంతో కూడిన నాటుబాంబులను తయారు చేయించి పొలం చుట్టూ అమర్చాడు. అది ఎవరికీ తెలియకుండా రహస్యంగా వుంచారు. అది తెలియక అదే కొత్తపల్లికి చెందిన మరోరైతు కె.సురేంద్ర పాడిఆవులు రెండు అటుగా వెళుతూ ఆ నాటుబాంబులను బెల్లం వుండలుగా భావించి కొరికాయి. ఒక్కసారిగా అవి పేలడంతో రెండు పాడిఆవుల ముఖాలు ఛిద్రమయ్యాయి. ఈ హృదయ విదారక సంఘటనపై వీఆర్‌ఓ కోటిరెడ్డి, సీఐ రాజారెడ్డి విచారణ చేశారు. బాధితరైతు సురేంద్ర వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పశుసంవర్థకశాఖ అధికారులు ఈ ఆవులను పరిశీలించి అవి బతకడం సాధ్యం కాదని ధ్రువీకరించారు. సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నారు.


నాటుబాంబు పేలి గాయపడిన పాడిఆవు, సంఘటనా స్థలంలో విచారిస్తున్న సీఐ రాజారెడ్డి

పేద రైతులకు 'ఉపాధి' అండగా...

● ఉద్యాన పంటలకు ఆర్థిక భరోసా ఇస్తున్న ఉపాధి పథకం
● బంజరు భూమిలో పండ్లతోటల సాగు
● సిరుల పంట పండిస్తున్న మహిళా రైతు గ్రేసమ్మ

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంటలు కలిసి రాక కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న పేద రైతులకు ఉపాధి పథకం ద్వారా చేపట్టిన ఉద్యాన పంటల సాగు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. పంటల సాగుకు అంతగా అనుకూలంగా లేని బంజరు భూమి కలిగిన రైతులు ఈ పథకం ద్వారా తక్కువ ఖర్చు తో అధిక లాభాలు పొందుతున్నారు. ఇదే కోవలో గ్రేసమ్మ అనే పేద మహిళా రైతు చీనీ సాగు చేపట్టి మంచి ఫలసాయం తీస్తూ.. స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పలువురు రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యానపంటలు సాగుకు మక్కువ చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 2019- 20 ఆర్థిక సంవత్సరంలో 1866 మంది రైతులు 2420 ఎకరాల్లో చీనీ తోటలను సాగులోకి తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా ఉద్యాన రెతులకు అందిస్తున్న రాయితీలు మరింత చేయూ త నిస్తున్నాయి. గ్రామీణ రైతులు, రైతు కూలీలను ఈ పథకంలో అనుసంధానం చేయడంతో చీనీ సాగు వైపు మొగ్గు చూపుతూ.. చక్కటి ఉపాధి పొందుతున్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఈపథకం కింద 703 మంది రైతులు 1857 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేపట్టారు. ఇందులో 246 మంది రైతులు 781 ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేశారు.


దౌలతాపురంలో సాగులో ఉన్న చీనీ తోట



పేద రైతులకు ఆదర్శంగా... గ్రేసమ్మ

మండలంలోని దౌలతాపురం గ్రామానికి చెందిన నల్లబల్లె గ్రేసమ్మ సాధారణ మహిళ రైతు. ఆమె భర్త రూబిన్ పేరుతో ఎకరా బంజరు భూమి ఉంది. ఆ భూమిలో చీనీ పంటను సాగు చేసి బంగారు పంట పండిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని అతి తక్కువ పెట్టుబడితో చీనీ చెట్ల సాగు చేపట్టి మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. 2019 జూలై చివరిన గ్రేసమ్మకు చెందిన ఎకరా పొలంలో చీనీ పంట సాగు కోసం రూ.64,337ల ఖర్చును సాంకేతిక సహాయకులతో అంచనా వేశారు. వంద చీనీ మొక్కలకు గాను వేతనాల ఖర్చు 88,612, మెటీరియల్‌కు 41454గా అంచనా వేశారు. అలాగే ఆమె జాబ్‌కార్డు హోల్డరు కాబట్టి 380 పనిదినాలకు 2019 సెప్టెంబరు 11న ఆ పని ఆమోదం పొంది.. అదే రోజు నుంచి దౌలతాపురంలోని శ్రమశక్తి సంఘాల ద్వారా పనులు ప్రారంభించారు. బంజరు భూమిని సాగులోకి తెచ్చి సాగుబడి నిర్వహణ, సంరక్షణకు మూడేళ్లపాటు 225 పనిదినాలతో రూ.50,161, వేతనాలకు యాజమాన్య వ్యయఖర్చులతో 14226 మొత్తం కలిపి 64331లను ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేశారు. ఈ చీనీ మొక్కలకు 5ఏళ్ల రాగానే 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటిసారి చీనీపంట దిగుబడి అందింది. మొదటి కాపులో దిగుబడి 1500 కేజీలు రాగా క్వింటా ధర 2300లతో 15 క్వింటాళ్లకు 34500 మేర రాబడి వచ్చింది. కాయల కోత, మార్కెట్ రవాణా ఖర్చులు పోను 30వేలు ఆమెకు లాభంగా చేతికి అందింది. భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలతో కుటుంబ భారం మోస్తున్న గ్రేసమ్మకు ఉపాధి ద్వారా అందిన చేయూత బలాన్నిచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీపథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రకారం పని కోరిన వారికి పని కల్పించడం జరుగుతుంది. జిల్లాలో ఈ పథకం ద్వారా ఎకరా బంజరు భూమి ద్వారా చీనీ పంటల పెంపకం సాగులోకి తీసుకువచ్చాం. చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామానికి చెందిన మహిళారైతు గ్రేసమ్మ (జాబ్‌కార్డు హోల్డర్) ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆమె చేసిన పనులకు సంబంధించి 50161 రూపాయలు వేతనాలు చెల్లించడం జరిగింది.

- పి.ఆదిశేషారెడ్డి, ఉపాధి పథక సంచాలకులు

పోలీసుల అదుపులో రౌడీషీటర్ హత్య కేసు నిందితులు?

ప్రొద్దుటూరు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రౌడీషీటర్ పప్పీ గ్యాంగ్‌కు చెందిన లీడర్ పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్ర హత్య కేసులో ప్రధాన నిందితులైన యనమల లోకేష్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని విచారణ నిమిత్తం కడపకు తరలించినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం హత్య సంఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు రెండు బృందాలుగా పలు చోట్ల గాలింపు చర్యలు చేపట్టారు. హత్య కేసులో నిందితులుగా వున్న లోకేష్‌రెడ్డి, సునీల్ రెడ్డిలకు చెందిన బంధువులు, స్నేహితులతో పాటు సెల్‌ఫోన్‌లో కాల్ రికార్డ్స్ ఆధారంగా కూడా పలువురిని విచారించారు. ఈక్రమంలో బుధవారం లోకేష్ రెడ్డి, సునీల్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి.. విచారణ నిమిత్తం కడప సీసీఎస్‌కు తరలించినట్లు సమాచారం. అయితే ఆదివారం రాత్రి ప్రొద్దుటూరులోని బీజీఆర్ లాడ్జిలో జరిగిన ఈ హత్యకు సంబంధించి.. పప్పీకి లోకేష్‌రెడ్డికి మధ్య ఏమైనా పాతకక్షలు ఉన్నాయా లేక మద్యం మత్తులో మాటామాటా పెరిగి ఘర్షణ పడి హత్య చేశారా అనే విషయం పోలీసుల విచారణలో తేలనుంది.

విద్యార్థులను చితకబాదిన అధ్యాపకుడు

● కళాశాల వద్ద తల్లిదండ్రుల వాగ్వాదం


విద్యార్థుల ఒంటిపై తేలిన వాతలను చూపుతున్న తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో ఇద్దరు విద్యార్థులను అధ్యాపకుడు చితకబాదడం వివాదాస్పదంగా మారింది. ఉదయం 10 గంటల సమయంలో విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటుండగా సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థులు చిన్న, కృపాకుమార్‌లు అల్లరి చేస్తుండగా అధ్యాపకుడు శ్రీనివాసులరెడ్డి వారిని వారించారు. అయినా వారి అల్లరి కొనసాగడంతో అధ్యాపకుడు మందలించాడు. ఓ విద్యార్థి తిరగబడడంతో ఆగ్రహించిన అధ్యాపకుడు బెత్తంతో చితకబాదాడు. దెబ్బలపై స్ప్రే చేసి ఇంటికి పంపారు. ఆ దెబ్బలు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్నం 1.30 గంటలకు కళాశాలకు వచ్చి అధ్యాపకులను నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలకు చేరుకుని ఆ కళాశాలపై చర్యలు తీసుకుని అధ్యాపకుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల వద్ద గొడవ జరుగుతుండడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకుడు మాట్లాడుతూ విద్యార్థులు అల్లరి చేస్తుండడంతో అధ్యాపకుడు మందలించాడని.. ఓ విద్యార్థి తిరగబడడంతో బెత్తంతో కొట్టినట్లు తెలిపారు. ఓ విద్యార్థి సోదరుడు కళాశాలకు చేరుకుని తమ వాడు అల్లరి చేయడం తప్పని, తప్పు చేసినవారిని దండించడం సబబేనని తెలిపినట్లు పేర్కొన్నారు.

యాక్షన్‌ప్లాన్‌లో సెలవుదినాలు తొలగించాలి : ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి యాక్షన్‌ప్లాన్‌లో సెలవు దినాలు తొలగించి సవరణ ప్లాన్ విడుదల చేయాలని ఏపీటీఎఫ్ (అమరావతి) రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారాలు పాఠశాలలకు ఉపాధ్యాయులు వెళ్లినా విద్యార్థులు మాత్రం రారన్నారు. స్థానిక అవసరాల మేరకు ప్లాన్‌ను పూర్తిస్థాయిలో మార్చుకునే వెసులుబాటును జిల్లా విద్యాశాఖ డీసీఈబీలకు కల్పించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలకు విద్యార్థిని ఎంపిక



నందలూరు, డిసెం బరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి భగ వద్గీత పోటీలకు మం డలంలోని అన్నమా చార్య అకాడమీ విద్యా ర్థిని ఓజస్వి గంగ ఎంపికైనట్లు సమ్మెట శి వప్రసాద్, మాడపూరి హేమలత తెలి పారు. బుధవారం వారు మాట్లాడుతూ శి వదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో గత నెల రోజులుగా వివిధ స్థాయి ల్లో నిర్వహిస్తున్న పోటీల్లో నెగ్గుతూ రాష్ట్ర స్థాయికి చేరుకున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 11న గీతాజయంతి సందర్భంగా ప్రొద్దు టూరులో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమామహేష్, అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

రాజంపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మౌనిక



రాజంపేట టౌన్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : రాజంపేట అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మౌని కను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. ఈమె ప్రస్తుతం రాజంపేట కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఒంటిమిట్ట సీఐగా బాబు

ఒంటిమిట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఒంటిమిట్ట, సిద్దవటం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కృష్ణంరాజునాయక్ బదిలీలో భాగంగా కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య


ఉమామహేశ్వర్‌రెడ్డి మృతదేహం

చెన్నూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన సంగటి ఉమామహేశ్వరరెడ్డి (26) అనే యువ రైతు అప్పులబాధతో బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వ్యవసాయ పనులు చేసుకోవడంతో పాటు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత మూడేళ్లుగా నాలుగు ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేసేవాడు. పంటలు సక్రమంగా పండక పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో బుధవారం తెల్లవారుజామున రోజువారీలో భాగంగా నడకకు వెళుతున్నట్లు ఇంటిలో చెప్పి బయల్దేరాడు. పుష్పగిరి రోడ్డులో ఉన్న గ్రామ సమీపంలో విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన బంధువులు స్థానికులు అక్కడకు చేరుకుని ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతి చెందాడు. సీఐ పురుషోత్తంరాజు పోలీసులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

600 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత



బద్వేలుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరారెడ్డి కళాశాల వద్ద బుధవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు నుంచి నెల్లూరు క్రిష్ణపట్నంకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో గుంతపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిఘా ఉంచారు. మైదుకూరులోని నవదుర్గ రైస్ ట్రేడర్స్‌కు చెందిన ఏపీ16పీఈ 3219 అనే లారీలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డుకుని తనిఖీ చేశారు. లారీలో 600 బస్తాలు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పిడుగుపాటుతో మహిళకు గాయాలు

పెండ్లిమర్రి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో మహిళకు గాయాలయ్యాయి. ఏనుగువారి పల్లెకు చెందిన పేర్ల నాగపార్వతి ఇంటి ముందర ఉండగా పిడుగు పడింది. దీంతో ఆమె అపస్మారకస్థితిలో పోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు.

కమలాపురం మండలంలో గేదె మృతి

కమలాపురం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంగంపల్లెలో బుధవారం మధ్యాహ్నం పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనిమల రాఘవ అనే రైతు ఇంటి సమీపంలో చెట్టు కింద గేదెను కట్టేశాడు. ఆ చెట్టుపై పిడుగుపడటంతో గేదె మృతి చెందింది. గేదె రూ.లక్షా 20వేలు విలువ చేస్తుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

గండికోట పర్యాటక అభివృద్ధికి అడుగులు : కలెక్టర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్, సంబంధిత ప్రాజెక్టు ఏజెన్సీతో కలసి గండికోట పర్యాట అభివృద్ధిపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రంగా భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాసిస్తుందన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించేలా సృజనాత్మకమైన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యాటకం అనేది ప్రజలకు వినోదం పంచడంతో పాటు వారి భద్రత సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే పోలీసు భద్రతలో భాగంగా 24/7 అందుబాటులో ఉన్న ఒక ఔట్‌పోస్టు నిర్వహణలో ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ , టూరిజంశాఖల సమన్వయంతో పర్యాటక కేంద్రంలో పర్యాటకులకు సంతృప్తికరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నామన్నారు. అనంతరం గండికోట పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు రిపోర్టుకు సంబంధించిన వివరాలను పీపీటీ ద్వారా కలెక్టర్ పరిశీలించి.. టూరిజం శాఖ అధికారికి పలు సూచనలు ఇచ్చారు.

కబ్జాకు గురైన దేవస్థానం స్థలాలను స్వాధీనం చేసుకుంటాం

● అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లలో దేవదాయశాఖకు సంబంధించి అన్యాక్రాంతమైన భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖ జిల్లా అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జున ప్రసాద్ తెలిపారు. వేంపల్లెలోని వృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి బస్టాండు పక్కన ఆక్రమణలో ఉన్న 71 సెంట్ల స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అక్కడ నుంచి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేశా రు. కొన్ని ఇళ్లకు నోటీసులు అందించారు. త్వరలోనే ఆక్రమించిన స్థలం ఖాళీ చేయాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఎక్కడా కూడా దేవదాయశాఖకు సంబంధించి ఆక్రమణలు ఉన్నా స్వాధీనం చేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అక్కడి ప్రజలు ఈ స్థలానికి సంబంధించి జిల్లా అధికారులతో రీసర్వే చేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సర్వేచేయిస్తామన్నారు. ఆక్రమించిన స్థలాలను వెంటనే ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈవో విశ్వనాదరెడ్డి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వల భవిష్యత్తు

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన చదువుతో ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ గురుకులం క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. వైస్‌చాన్సలరు మాట్లాడుతూ యూనివర్శిటీలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. క్రమశిక్షణతో మెలగడం, గ్రంథాలయం వినియోగించుకోవడం, అధ్యాపకుల సలహాలు నిరంతరం అమలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ప్రగతికి మార్గాలన్నారు. ఎండీఏ విభాగం ప్రొఫెసరు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు భయపడకుండా ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగాఎదుర్కోవాలన్నారు. అనంతరం ప్రొఫెసరు సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ అమృత్ ప్రసాద్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జాతీయస్థాయి క్రీడలకు కేజీబీవీ విద్యార్థినులు


క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రత్యేక అధికారిణి ఫణిశ్రీ

అట్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అట్లూరు కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్ 14, బేస్‌బాల్ అండర్ 17 మరియు అట్యాపాట్యా జాతీయస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థినులు లక్ష్మి ప్రసన్న, తనూజా, బత్తల దీపిక, అమరావతి, రిషిత, సుధా ఎంపికైనట్లు తెలిపారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీలతో కలిసి అభినందించారు.

'నిఘా' నేత్రాలు

● నేరస్తులను వెంటాడుతున్న సీసీ కెమెరాలు
● పలు కేసుల ఛేదనలో తోడ్పాటు
● రైల్వేకోడూరులో సీసీ కెమెరాల పనితీరుపై ప్రశంసలు


కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీఐ హేమసుందర్ రావు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో ఎన్నో సంచలనమైన కేసుల ఛేదనలో నిఘా నేత్రాలు కీల కపాత్ర పోషిస్తున్నాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, మార్కెట్ వీధి, టోల్‌గేట్, రైల్వే స్టేషన్ రోడ్డు, మార్కెట్ యార్డు వంటి ప్రధాన ప్రదేశాలలో నిఘా నేత్రాలు నేరస్తులను వెంటాడుతున్నాయి. వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, క్రయవిక్రయాల్లో రాష్ట్రంలో గుర్తింపు పొందిన రైల్వేకోడూరు పట్టణంలో నేరాల కట్టడికి పోలీసు యంత్రాంగం వినియోగిస్తున్న నిఘా కెమెరాల పనితీరు భేష్ అంటున్నారు కోడూరు వాసులు. నేరాలను అరికట్టడానికి 2017 ఆగస్టు నేలలో అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ అట్టాడ బాపూజీ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోలు గదిని ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన కూడలి, రహదారి, వీధుల్లో ఆధునాతనమైన 18 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సహాయం లేకుండా అప్పటి సీఐ సాయినాథ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, భక్తవత్సలం కెమెరాల ఏర్పాటు కోసం కృషి చేసి ఏపీఎండీసీ సంస్థ ద్వారా 9 లక్షల 60వేల రూపాయిలు మరియు దాతల సహకారంతో రూ.5 లక్షలు మొత్తం 15 లక్షల రూపాయిలు నిధులు సేకరించి సీసీ కెమెరాలు విస్తృతంగా ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పట్ట ణంలోని పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నలుగురు పోలీస్ సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో అనేక కేసుల చేధించిన సంఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం సీసీ కెమెరాలు కొన్ని మరమ్మతులకు గురయ్యా యి. వీటికి మరమ్మతులు చేయడంతో పాటు పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు, నేరాలను అరికట్టాలంటే సీసీ కెమెరాలను పూర్తిగా ఏర్పాటు చేయాలని రైల్వేకో డూరు ప్రజలు కోరుకుంటున్నారు.


బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సీసీ కెమెరాల ద్వారా చేధించిన కేసుల వివరాలు

● 2018 సంవత్సరంలో రంజాన్ పండుగ రోజు పాత బస్టాండ్ సినిమా హాల్ వద్ద ముస్లిం యువకుడిని దారుణంగా హత్య చేసి పారిపోయారు. సీసీ కెమెరాల ద్వారా హంతకులు ఉపయోగించిన వాహనాన్ని గుర్తించి అప్పటి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, భక్తవత్సలం చెన్నైకు వెళ్లి హంతకులను పట్టుకుని కేసును చేధించారు. కేసును చేధించిన ఎస్ఐలకు ఐజీ ప్రతిష్టాత్మకమైన ఏబీసీడీ అవార్డును అందించారు.

● పట్టణంలో కొత్త కోడూరు ప్రాంతంలో సంచలనమైన నాయుడు హత్య కేసును విచారిస్తుండగా హంతకుడు వెళ్లిన మార్గాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసు చేధించారు.

● పట్టణంలో ఓ వ్యాపారి బ్యాంకు నుంచి 3 లక్షల రూపాయిలు తీసుకుని వస్తుండగా కొంతమంది అతన్ని దారి మళ్లించి నగదు ఉన్న బ్యాగును అపహరించారు. సీసీ కెమెరాల ద్వారా గంట వ్యవధిలో నింధితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణానికి చెందిన ఓ మహిళ తిరుపతి నుంచి వచ్చి ఆటోలో రూ.లక్ష నగదు 20 వేల విలువైన మొబైల్ ఫోన్‌కు మరిచిపోయి వెళ్లిపోయారు. బాధితులు కమాండ్ కంట్రోలుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. బస్టాండ్ వద్ద ఉన్న కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించి బాధితులకు నగదు అందజేశారు.

● పట్టణంలో చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న యువకులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారిని రిమాండ్‌కు తరలించారు. కొంతమంది యువతులు మిస్సింగ్ కేసులను నిఘా కెమెరాల ఆధారంగా చేధించి పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలో జరిగిన పలు యాక్సిడెంట్ కేసులను సీసీ కెమెరాల ద్వారా చేధించిన సంఘటనలు చాలా ఉన్నాయి.

సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నాం.

పట్టణంలోని పలు రద్దీ ప్రదేశాలలో కెమెరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేస్తున్నాం. గంగమ్మ తల్లి కమిటీ సభ్యుల సహకారంతో నూతనంగా 8 కెమెరాలు ఏర్పాటు చేశాం. పట్టణంలో నేరాలు అరికట్టాలంటే 40 కెమెరాలు అవసరం. అన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలంటే సూమారు 10 లక్షల రూపాయిలు నిధులు అవసరం. దాతలు ముందుకు వస్తే త్వరలో రైల్వేకోడూరు పట్టణంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

- హేమసుందర్ రావు, రైల్వేకోడూరు అర్బన్ సీఐ

మార్కెట్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలి : ఏడీఏ



మార్కెట్ కమిటీ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఎం త్యాగరాజు

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో వచ్చే సీజన్ నాటికి రైతులకు సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు సూచించారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో సాధారణ తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఇప్పటి వరకు వున్న ట్రేడర్ లైసెన్సులు రెన్యువల్ వేగవంతం చేయాలన్నారు. మండీ యజమానుల నుంచి రావాల్సిన అద్దె బకాయిలను ఎప్పటి కప్పుడు వసూలు చేయాలన్నారు. ప్రస్తుతం అన్‌సీజన్ నడుస్తున్నందున మార్కెట్‌లో రైతు విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు ఇతర భవనాలకు మరమ్మతులు పూర్తి చేయించాలన్నారు. పారిశుద్ధ్యం పనులను రోజూ పర్యవేక్షించాలన్నారు. సెక్రటరి అభిలాష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బకాయిలున్న రూ.30లక్షల అద్దెను వసూలు చేశామన్నారు. మిగిలిన మొత్తాన్ని త్వరలో వసూలు చేస్తామన్నారు. గతంలో నిలిచిపోయిన బకాయిల విషయమై పూర్వపు అధికారులతో ఏడీఎం చర్చించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మదనపల్లెలోని రైతుబజార్‌లో వర్షపు నీరు నిల్వ వుండకుండా మట్టితోలి చదును పనులు చేపట్టామన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన సెక్రటరి మనోహర్, సూపర్‌వైజర్ వినయ్, యజమానులు సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగును సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ సత్యనారాయణ, డాక్టర్ సురేష్

నిమ్మనపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బహువార్షిక పశుగ్రాసం సాగును సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి డివిజన్ పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం అగ్రహారం, రాచవేటివారిపల్లి, ముష్టూరు, తవళం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు వేస్తున్న పీపీఆర్ వ్యాక్సిన్, పశుగణనపై ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు 5నుంచి 10సెంట్ల భూమిలో పాడి ఆవుల కోసం పశుగ్రాసాన్ని పెంచుకుంటే ప్రభుత్వం ఉపాధి కింద రెండేళ్లకు కలిపి ఉచితంగా రూ.32వేలను వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు. ప్రస్తుతం ఈ పథకంలో తొలి విడతగా జిల్లా వ్యాప్తంగా 1000మంది రైతులను ఎంపిక చేస్తుందన్నారు. పశుగణన ఐదేళ్లకొక పర్యాయం జరుగుతుందన్నారు. మండలంలోని గొర్రెలు, ఆవులు, బాతులు, కోళ్లు, ఇతర జంతువు, పక్షులను లెక్కించి తరువాత వాటికి కావలసిన ధాన్యం, దానా, పశుగ్రాసం వంటివి ఏర్పాటు చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రస్తుతం ఎదకు వచ్చిన పాడి ఆవులకు (సెక్స్ సార్టెడ్ సెమెన్) టీకాలు వేస్తే 90శాతం ఆడ దూడలు జన్మిస్తాయని తెలిపారు. అయితే ఈ టీకా విలువ రూ.1350లు కాగా ప్రభుత్వం సబ్సిడీతో కేవలం రెండు టీకాలకు కలిపి రూ.500లకే అదిస్తుందని తెలిపారు. పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో స్వాస్థ్య ఆస్పత్రి ముందడుగు

● పద్మభూషణ్ ముంతాజ్ అలీ



ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న ముంతాజ్ అలీ

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవా కార్యక్రమాల్లో స్వాస్థ్య ఆస్పత్రి మరో ముందడుగు వేసిందని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ ముంతాజ్ అలీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్వాస్థ్య ఆస్పత్రిలో ఐసీయూ విభాగాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రోగులు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐసీయూ యూనిట్ ఏర్పాటుకు ఫస్ట్‌సోర్స్ సంస్థ వైద్య పరికరాలను విరాళంగా అందించిందన్నారు. స్వాస్థ్య ఆస్పత్రి పూర్తిగా స్వచ్ఛంద వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల కన్నా నామమాత్రపు ఫీజులతో స్వాస్థ్య ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్సంగ్ ఫౌండేషన్ సెక్రటరి మహేందర్, ట్రెజరర్ నటరాజన్, ఫస్ట్‌సోర్స్ ప్రతినిధి శంకర్, రాజన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు ఎస్‌ఐగా నరసింహుడు



ములకలచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఎస్‌ఐగా నరసింహుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న గాయత్రిని మదనపల్లెకు, పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ నరసింహుడును ఇక్కడికి బదిలీ చేస్తూ ఎస్పీ విద్యా సాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ ఖాజాబీ పేర్కొన్నారు. డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి డిసెంబరు6న కొత్తవారిపల్లె సచివాలయం వద్ద సదస్సు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు, రేషన్‌కార్డుల కోసం, ఇతర రెవెన్యూ సమస్యలు ఉన్నవారు సదస్సుకు హాజరై అధికారుల దృష్టికి తీసుకొచ్చేలా సంబంధిత అధికారులకు అర్జీలు సమర్పించాలన్నారు.

గుర్రంకొండ మండలంలో...

గుర్రంకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. ఈ నెల 6న టి.పసలవాండ్లపల్లె, 10న ఎల్లుట్ల, 12న చెర్లోపల్లె, 14న నడిమిఖండ్రిగ, 17న చిట్టిబోయినపల్లె, 19న తరిగొండ, 21న గుర్రంకొండ, 24న సరిమడుగు, 26న అమిలేపల్లె, మర్రిమాకులపల్లె, 28న సంగసముద్రం, జనవరి 2న శెట్టివారిపల్లె, అరిగెలవారిపల్లె, 3న టి.రాచపల్లె, రామాపురం, 7న కండ్రిగ, 8న మర్రిపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

తంబళ్లపల్లె మండలంలో...

తంబళ్లపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో 6వ తేదీ నుంచి నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు హరికుమార్ తెలిపారు. ఆయా సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6న ఎద్దులవారిపల్లె, 7న కోటాల, 10న గోపిదిన్నె, 11న దిగువపాళ్యం, 12న గుండ్లపల్లె, 13న కోసువారిపల్లె, 17న బాలిరెడ్డిగారిపల్లె, 18న తంబళ్లపల్లె-1, 19న తంబళ్లపల్లె-2, 20న ఎర్రసానిపల్లె, 24న పంచాలమర్రి, 26న గంగిరెడ్డిపల్లె, 27న కొట్లపల్లె, 28న రేణుమాకులపల్లె, 31న కన్నెమడుగు, జనవరి 2న మర్రిమాకులపల్లె, 3న కోటకొండ, 4న కుక్కరాజుపల్లె, 7న జుంజురపెంట సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు హాజరై రెవెన్యూ, ఇతర సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు.

సభ్యత్వంతో రూ.5లక్షల ప్రమాద బీమా



గోపిదిన్నెలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల బీమా, పలు రాయితీలు లభిస్తాయని రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్ అన్నారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గోపిదిన్నె పంచాయతీలో సభ్యత్వ నమోదులో వారు మాట్లాడుతూ సభ్యత్వం కలిగిన కార్యకర్త దురదుష్టవశాత్తు మృతి చెందితే దహన సంస్కారాలకు రూ.10వేలు అందచేస్తుందన్నారు. సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ యువనేత జగదీష్, భాస్కర్, శ్రీనివాసులు, జయరాంరెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ములకలచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. బురకాయలకోటలో బుధవారం సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతలు, కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రాజు, సుబ్బిరెడ్డి, మారప్ప, శ్రీనివాసులు, మద్దిరెడ్డి, రాజు, రిజ్వాన్‌బాషా, వలి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోండి



పొలం పిలుస్తోందిలో సూచనలు చేస్తున్న ఏఓ ప్రేమలత

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాప్ నమోదు తప్పని సరిని మండల వ్యవసాయాధికారి ప్రేమలత పేర్కొన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం రాపూరివాండ్లపల్లె పంచాయతీలో రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో సాగైన వరి, వేరుశనగ, టమోటా పంటలకు ప్రకృతి వైపరిత్యాల కారణంగా నష్టం జరిగిన రైతులకు బీమా వర్తిస్తుందన్నారు. పంట బీమా ప్రీమియం వేరుశనగకు ఈ నెల 15వ తేదీ లోపు, వరికి 31వ తేదీ లోపు సంబంధిత రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా గానీ లేదా కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా రైతు వాటా చెల్లించాలన్నారు.

వర్షంలోనూ సరుకుల కోసం....

ఎండీయూ ఆపరేటర్‌పై విమర్శలు



వర్షంలోనూ రేషన్ సరుకుల కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

పీలేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్ల నిర్లక్ష్యంతో ఇంటివద్దకే సరుకులు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. జాతీయ రహదారిపై వర్షంలో గంటల తరబడి నిలబడడంపై ప్రజలు, లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు వర్షంలో తడుస్తూ క్యూలో ఉండడం సోషియల్ మీడియాలో హల్‌చల్ జరిగింది. స్థానిక కడప రోడ్డులో రేషన్ సరుకుల మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. సరుకుల కోసం వర్షంలో లబ్ధిదారులను జాతీయ రహదారిపై గంటల తరబడి నిలబెట్టడంపై ప్రజలు, లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. సోషియల్ మీడియాలో హల్‌చల్ కావడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సరుకులు అందించాల్సింది పోయి లబ్ధిదారులందరినీ, వర్షంలో జాతీయ రహదారిపైకి రమ్మనడంపై ఆగ్రహించారు. వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో సరుకుల పంపిణీని అర్ధరంతరంగా నిలిపేశారు. తమకు రావాల్సిన సరుకులను ఇళ్ల వద్దకు చేర్చాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో విద్యార్థి ప్రభావ్(12) మృతి చెందాడు. వివరాల్లోకెళితే... పట్టణ సమీపంలోని పింగాణి ఫ్యాక్టరీ ప్రాంతీయులు శేఖర్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు ప్రభావ్ పీవీసీ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డకు తల్లిదండ్రులు చికిత్స కూడా చేయించారు. మంగళవారం రాత్రి ప్రభావ్‌కు తలనొప్పి తీవ్రం కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రభావ్‌ను తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బుధవారం ఉదయం ప్రభావ్ మరణ వార్త తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు మృతదేహాన్ని పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభావ్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బంగ్లాదేశ్ ఘటనపై నిరసన ర్యాలీ



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న హిందు ఐక్యవేదిక సభ్యులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయం వద్ద నుంచి పెద్దఎత్తున్న హిందువులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం కలగజేసుకుని విదేశాంగమంత్రి ద్వారా అక్కడ జరుగుతున్న దాడులను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయాలని, యావత్ ప్రపంచం ఈ దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు బండి ఆనంద్, దుర్గాప్రసాద్, మహేష్, సురేష్, రామ్మోహన్‌రెడ్డి భగవాన్, వరదారెడ్డి నారథరెడ్డి, బర్నేపల్లె రవికుమార్, డీఆర్ జగదీష్, వెంకటరమణారెడ్డి, పచ్చిపాల వసంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'అసంబద్ధ నిర్ణయాలు రద్దు చేయాలి'

పీలేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అదనపు తరగతుల కాలనిర్ణయ పట్టిక, ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు, పండుగ, ఆదివారాల్లో అదనపు తరగతులు వంటి అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పీలేరులో ఎంఈఓ లోకేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేసిన యూటీఎఫ్ నేతలు శివారెడ్డి, అక్రమ్ బాషా మాట్లాడుతూ ఉన్నతాధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల కారణంగా ఉపాధ్యాయుల్లో అభద్రతా భావం నెలకొంటోందన్నారు. మండలాల్లో 10 శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదన్న ఆంక్షలతో అత్యవసర సమయాల్లోనూ ఉపాధ్యాయులకు ఎంఈఓలు సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు 100 రోజుల ప్రణాళిక అంటూ ఆదివారాలు, పండుగ రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలనడం పట్ల అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు మానసిక వత్తిడికి గురవుతున్నట్లు వారు తెలిపారు. నాయకులు బాషా, సుధాకర్, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్, కృష్ణమూర్తి, మునిరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాసులు, రమణయ్య, నాగసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూలఅంగళ్లకు ప్రత్యామ్నాయం చూపండి

- కమిషనర్‌కు బాధితుల వినతి



కమిషనర్ పల్లవికి వినతిపత్రం ఇస్తున్న పూలవ్యాపారులు

బి.కొత్తకోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల ఆక్రమణల తొలగింపులో భాగంగా పూలఅంగళ్ల స్థలాలను కోల్పోయిన బాధితులు బుధవారం నగర పంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవిని కలిశారు. తాము 20 ఏళ్లుగా జ్యోతిచౌక్‌లో పూలఅంగళ్లు ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని వివరించారు. ఇపుడు ఆ స్థలాలను ఖాళీ చేయించడంతో ఉపాధిని కోల్పోయామన్నారు. న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని కమిషనర్‌కు సమర్పించారు. తమకు ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని కోరారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. పూల వ్యాపారులకు సంఘీభావంగా ఎమ్మార్పీఎస్, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి పనులకు వచ్చే వారి సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఏపీఓ అంజినప్ప ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో గ్రామాల వారీ మొత్తం కూలీల సంఖ్య, పనులకు వస్తున్న వారి సంఖ్య, చేపడుతున్న పనులు, చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధి ఇంజనీరు రామన్న, ఎంటీఏలు శేఖరమ్మ, శంకర, వెంకట్రమణ, నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజినల్ స్థాయి టెక్‌ఫెస్ట్‌ను గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభించనున్నారు. రెండు రోజులపాటు జరిగే రీజినల్ టెక్‌ఫెస్ట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొంటున్నాయి. మొదటి రోజు కార్యక్రమానికి ఎమ్మెల్యే సహా సాంకేతిక విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టరు (ఎస్వీయూ రీజియన్) ఎ.నిర్మల్ కుమార్ ప్రియ హాజరవుతారు. జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.ఎస్. సుకుమార్ (చంద్రగిరి), వై.దారకనాథ రెడ్డి (ఎస్వీజీపీ తిరుపతి), ఎస్వీ కుమార్ (పిళ్లారిపట్టు), ఎం.జగన్నాథ రావు (కుప్పం), జి. ఉషాదేవి (సత్యవేడు), జి. అనంత (ఎస్పీడబ్ల్యు తిరుపతి), మమ్మద్ (పలమనేరు), కె. ఓబులేశు (మదనపల్లె), అన్ని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల యాజమాన్యాలు పాల్గొంటున్నాయి. కలికిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు నోడల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నారు.

కొనసాగుతున్న పనుల పరిశీలన

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కింద ఐదు నెలల్లో పూర్తయిన పనుల పరిశీలన కొనసాగుతోంది. నలుగురు ఏపీడీల ఆధ్వర్యంలో నాలుగు బృందాలు పనుల పరిశీలన చేపట్టాయి. మండలంలో జరిగిన పనులపై ఫిర్యాదులు రావడంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. రాజంపేట ఏపీడీ ఎం. ప్రతాప్, రాయచోటి ఏపీడీ లక్ష్మీనరసయ్య, కలికిరి ఏపీడీ ఎస్. శ్రీనివాసులు, తంబళ్ళపల్లె ఏపీడీ ఎస్.మధుబాబు ఆధ్వర్యంలో నాలుగు టీములు ఏర్పాటైన విషయం తెలిసిందే. బుధవారం మొదటి రోజు పనుల వద్దకు వెళ్ళి కొలతలు తీశారు. పనుల్లో పాల్గొన్న కూలీలను కలిసి చెల్లింపులను నిర్ధారణ చేసుకున్నారు. ఒక్కో టీము ఆయా గ్రామ పంచాయతీల్లో ఆరు, ఏడు పనులను పరిశీలిస్తోంది. మస్టర్లలో కూలీల హాజరును సరిపోల్చుతున్నారు. పనుల పరిశీలన మరో నాలుగు రోజులు పట్టొచ్చు.

పీఎంఏవై గృహాలకు దరఖాస్తు చేసుకోండి : ఏఈ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ఇల్లు లేని నిరుపేదలు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే పీఎంఏవై పథకం ద్వారా అందించే పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లా డుతూ పీఎంఏవై ద్వారా పక్కా గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. నిరుపేద కుటుంబీకులు ఆయా సచి వాలయాల్లో లబ్ధిదారుని రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజు ఫోటో, కులధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రం తనిఖీ



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల జనన, ధ్రువీకరణపత్రాల్లో తప్పులను సరిదిద్దేందుకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రోజు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల్లో ఉన్న తప్పులను సరిదిద్ది విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని మండలంలో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేవామన్నారు. ఇందులో తుమ్మరకుంట ఆధార్ కేంద్రం డిజిటల్ అసిస్టెంట్ లీవులో ఉన్న కారణంగా తుమ్మరకుంట కేంద్రం తాత్కాలికంగా పని చేయలేదు. కాట్లగల్లు, పీటీఎం కేంద్రాల్లో ఆధార్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆదార్ కేంద్రాలు విధిగా నిర్వహించాలని ఆదార్ కేంద్రాల నిర్వాహకులకు ఎంపీడీఓ సూచించారు. ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆధార్ కేంద్రాలు సమయ పాలన పాటించాలని ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ యోగానంద్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మదనపల్లె అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం పడిపూజను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన తంత్రి మనోజ్‌తంత్రితో మదనపల్లె అయ్యప్పస్వామి ఆలయంలో పడిమెట్లు ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామివారికి నెయ్యి అభిషేకం చేశారు. 18 మెట్లను పూర్ణ కలశాలతో ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. ఆలయంలో స్వామియే శరణ అయ్యప్ప అంటూ భక్తుల హర్షధ్వానాలతో మార్మోగింది. అంతకముందే ఆలయ అవరణ అంతా ప్రత్యేక పూలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు జర్మనీరాజు, భగవాన్, బాలకృష్ణ, హేమంత్, కేశవ, పోస్టాఫీస్ రమణ, అమర, శివమూర్తి, వాసు, తదితరులు పాల్గొన్నారు.





ఆలయంలో పూజ కోసం ఏర్పాటు చేసిన పడిమెట్లు
విశేష సంఖ్యలో హాజరైన అయ్యప్పస్వామి మాలధారులు

తహసీల్దార్ అవినీతిపై విచారణ చేయాలి



ఏపీ వ్యవసాయకార్మిక సంఘం నేతల నిరసన

మదనపల్లె అర్బన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ చేసి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఏపీ వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. లంచగొండి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన వారు మాట్లాడుతూ రైతు, ప్రజా సమస్యలపై లంచాలు డిమాండ్ చేస్తున్న ఆరోపణలపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి భూమి మ్యుటేషన్‌కు లంచం డిమాండ్ చేశారని ఆరోపణలున్నా కలెక్టర్ ఎందుకు చర్యలు తీసుకోలేదని, ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. పేదల భూసమస్యలను పరిష్కరించకుండా, ధనవంతుల వద్ద లంచం తీసుకుని పనికానిచ్చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంఘం, ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్, తిరుమల, మురలి, మణి, కాటమయ్య, నీలావతి, నిర్మల, గోపాల్, మల్లికార్జున వెంకటేస్, కుమారి, కిషోర్ పాల్గొన్నారు.